Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 130 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 జూన్ 2023 గురువారం పేజీలు : 4

## మళ్లీ బీభత్సంగా పెరిగిన బంగారం, వెండి ధరలు

బులియన్ మార్కెట్‌లో ఇటీవల కాలంలో బంగారం, వెండి ధరలు నిన్న కాస్త ఊరటనిచ్చిన విషయం తెలిసిందే. హమ్మయ్యా.. ఇక తగ్గుతుందిలే అనుకునే లోపు బంగారం ధర మళ్లీ పెరిగింది. నేడు బంగారం, వెండి ధరలు తిరిగి పరుగు అందుకున్నాయి. నేడు తులం బంగారంపై రూ.550 మేర పెరిగింది. బుధవారం ఉదయం వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.500 మేర పెరిగి రూ.56,200 లు ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.550 వరకూ పెరిగి రూ.61,310కి చేరుకుంది.

వెండి కూడా బంగారం బాటలోనే పయనిస్తోంది. కిలో వెండి ధరపై రూ.750 మేర పెరిగి రూ.77350కి చేరుకుంది.



# తెలంగాణ అర్చకులకు శుభవార్త

## గౌరవభృతి రూ. 5 వేలకు పెంపు.. వయసు 65 ఏండ్లకు తగ్గింపు

హైదరాబాద్ : రాష్ట్రంలోని అర్చకులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. వేదశాస్త్ర పండితులకు ప్రతి నెల ఇస్తున్న గౌరవభవృతిని రూ. 2,500 నుంచి రూ. 5 వేలకు పెంచుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గోపన్‌పల్లిలో 9 ఎకరాల స్థలంలో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో బ్రాహ్మణుల సంక్షేమాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. బ్రాహ్మణ సదనాన్ని ప్రారంభించుకున్న నేటి శుభ సందర్భంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న మరిన్ని నిర్ణయాలను మీ అందరికీ తెలియజేయడానికి సంతోషిస్తున్నాను అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రాహ్మణ పరిషత్ ద్వారా వేదశాస్త్ర పండితులకు ప్రతి నెల ఇస్తున్న గౌరవ భృతిని రూ. 2,500 నుంచి రూ. 5 వేలకు పెంచుతున్నాం. ఈ భృతిని పొందే అర్హత వయసును 75 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు తగ్గిస్తున్నాం అని కేసీఆర్ ప్రకటించారు.

**మరో 2,796 దేవాలయాలకు ధూపదీప నైవేద్యం..** ప్రస్తుతం రాష్ట్రంలోని 3,645 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం వర్తిస్తున్నది అని కేసీఆర్ గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 2,796 దేవాలయాలకు కూడా ధూపదీప నైవేద్యం పథకం విస్తరింపజేస్తాం. దీంతో రాష్ట్రంలో 6,441 దేవాయాలకు ధూపదీప నైవేద్యం కింద



నిర్వహణ వ్యయం అందుతుంది. ఈ సందర్భంగా మరో శుభవార్త కూడా మీతో పంచుకుంటున్నాను.

ఇప్పటి వరకు ధూపదీప నైవేద్యం పథకం కింద దేవాలయాల నిర్వహణ కోసం అర్చకులకు నెలకు రూ. 6 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తున్నది. ఈ మొత్తాన్ని రూ. 10 వేలకు పెంచుతున్నామని తెలియజేస్తున్నాను. ఈ నిర్ణయం మీ అందరిని ఎంతో సంతోషపెడుతుందని భావిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

**బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ :** వేద పాఠశాలల నిర్వహణ కోసం ఇస్తున్న రూ. 2 లక్షలను ఇక నుంచి యాన్యువల్ గ్రాంట్‌గా ఇస్తామని తెలియజేస్తున్నాను అని కేసీఆర్ తెలిపారు. ఐటీఎం, ఐఐఎం లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదివే బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింజేసే నిర్ణయం తీసుకున్నాం. అదే విధంగా అనువంశిక అర్చకుల సమస్యలను త్వరలో కేబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నాను. సనాతన ధర్మ పరిరక్షణ నిలయంగా, వేద పురాణాల ఇతిహాసంగా, విజ్ఞాన సర్వసంగా, వైదిక క్రతువుల కరదీపికగా, పేద బ్రాహ్మణుల ఆత్మబంధువుగా, లోక కల్యాణకారిగా తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఈ విప్రహిత వెలుగొందాలని ఆ దేవ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.



## బ్రిజ్ భూషణ్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..? కేంద్రాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మె ల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు. గత కొంతకాలంగా దేశ రాజధానిలో రెజ్లర్లు వివిధ రూపాల్లో నిరసనలు ఆందోళనలు తెలుపుతున్న కూడా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రెజ్లర్లు లేవనెత్తుతున్న అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కష్టపడి, నిబద్ధతతో, దేశభక్తితో మహిళా రెజ్లర్లు ప్రపంచానికి భారతదేశ ప్రతిభను కనబరిచారనీ ఆమె పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రెజ్లర్ల సమస్యల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

పోక్సో వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నప్పటికీ నిందితుడు బయట తిరుగుతున్నాడని, బాధితులకు న్యాయాన్ని నిరాకరించరాదని స్పష్టం చేశారు. దేశానికి బంగారు పతకాలు సాధించిన మహిళ క్రీడాకారుల పట్ల అనుచితంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. ఈ వ్యవహారాన్ని మొత్తం ప్రపంచమంతా చూస్తోందని, దేశ ప్రజలు కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి చర్యలు తీసుకోవాలని కవిత సూచించారు.

# ఎదగలేక.. ఒదగలేక.. త్రిశంకు స్వర్గంలో కామ్రేడ్లు!



హైదరాబాద్ : "ఏమాత్రం అవకాశం ఉన్నా.. ఎదిగేందుకు మేం సిద్ధం" ఇటీవల విజయవాడలో జరిగిన సీపీఐ-సీపీఎం సంయుక్త సమావేశం(జాతీయ కార్యవర్గం సదస్సు)లో కామ్రేడ్లు చెప్పుకొన్న ప్రతిష్టాత్మకమైన సంకల్పం ఇది. అయితే.. అవకాశాలను అందిపుచ్చుకుని పార్టీలు ముందుకు సాగుతుంటే.. కామ్రేడ్లు మాత్రం ఎవరో ఇచ్చే అవకాశం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఎదగలేక.. ఒదగలేక.. త్రిశంకు స్వర్గంలో ఎర్రజెండా రెపరెపలాడుతోంది. ఎమ్మడి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మూడు దశాబ్దాల కిందట కమ్యూనిస్టుల హవా జోరుగా సాగింది. పొత్తులు పెట్టుకునే పరిస్థితి వచ్చిందంటే.. కమ్యూనిస్టులు లేని పరిస్థితిని ఉహించలేం.

అనే పరిస్థితి ఉంది. కానీ కాలక్రమంలో కమ్యూనిస్టులు తమకు తాము పార్టీని డైల్యూట్ చేసుకున్నామనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏపీలో తీసుకుంటే.. ప్రజామోదం పొందేందుకు.. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు అవకాశం ఉంది. కానీ సీపీఎం నాయకులు మాత్రం మౌనంగా ఉన్నారు. అదేమంటే..తాము వేచి చూస్తున్నామని చెబుతు న్నారు. కానీ వాస్తవానికి బహిరంగ విమర్శ ఏంటంటే.. సీపీఎం నేతలు.. అధికార పార్టీతో లాలూచీ పడుతున్నారని.. ఫలితంగా సీపీఎం జాడ.. ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు.. సీపీఐని తీసుకుంటే.. టీడీపీతో పొత్తుకు సిద్ధమని ప్రకటిస్తున్నా.. ఎక్కడో తేడా కొడుతోందనే ఆలోచన ఈ పార్టీని ఇబ్బంది పెడుతోంది. మొత్తంగా చూస్తే.. ఏపీలో కమ్యూనిస్టులు ఎక్కడా పుంజుకోకపోగా.. ఇబ్బందులు కొని తెచ్చుకున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇక తెలంగాణ విషయానికి వస్తే.. అధికార పార్టీతో ఈ రెండు కమ్యూనిస్టు పార్టీలు కూడా అంతర్గత ఒప్పం దానికి వచ్చాయి. తాము అవకాశ వాద రాజకీయాలకు వ్యతిరేకం అంటూనే.. పొత్తులకు తెరదీసేందుకు రెడీగా ఉన్నాయి. అయితే..కేసీఆర్ నుంచి సరైన సిగ్నల్ ఇప్పటి వరకు రాలేదు.

దీంతో వేచి చూసే ధోరణిలోనే ఉన్నాయి. ఫలితంగా.. తెలంగాణలో ఎదిగేందుకు స్కోప్ ఉండి కూడా ఎదగలేక.. ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు. మొత్తంగా ఎన్నికలకు ఏడాది ముందు అయినా.. కమ్యూనిస్టులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతారో లేదో చూడాలి.




# టార్గెట్ కేసీఆర్

## యాక్టివ్ రోల్ తీసుకున్న అమిత్‌షా

హైదరాబాద్ : కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణాలో యాక్టివ్ కాబోతున్నారా ? పార్టీవర్గాలు అవుననే అంటున్నాయి. పార్టీకి ఆదరణ బ్రహ్మాండంగా ఉందని అయితే సరైన నాయకత్వమే లోపిస్తోందని అనుకుంటున్నారట. అందుకనే అధ్యక్షుడు బండి సంజయ్ ఉన్నప్పటికీ అమిత్ షా కూడా యాక్టివ్ రోల్ ప్లే చేయాలని డిసైడ్ అయ్యారట. ఒకరకంగా చెప్పాలంటే బండిని పక్కనపెట్టేసి అమిత్ షా యే పార్టీపగ్గాలు అందుకోబోతున్నారని పార్టీలో టాక్ నడుస్తోంది. ఇదంతా ఎందుకంటే వచ్చేఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయట. ఈ సమయంలో అగ్రనేతలు గట్టిగా పట్టుబడితే అధికారంలోకి వచ్చేయటం ఖాయమని అనుకుంటున్నారని సమాచారం. బండి నాయకత్వానికి వచ్చిన సమస్యేమీ లేదు. అయితే చాలామంది సీనియర్లు బండి ఆదేశాలను పట్టించుకోవటంలేదు. ఈటల రాజేందర్ కు బండికి పడటంలేదు. బండి కూడా చాలామంది సీనియర్లను కట్టడిచేయలేకపోతున్నారట.

ఈమధ్యనే రాష్ట్రానికి చెందిన అత్యంత ప్రముఖ నేతలు సుమారు 20 మందితో అమిత్ షా జేపీ నడ్డా తదితరులు ఢిల్లీలో సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో చర్చల తర్వాత అగ్రనేతలు పై నిర్ణయం తీసుకున్నారట. పార్టీలోకి నేతలను చేర్చుకోవటం టికెట్ల కేటాయింపుల్లాంటి అంశాల్లో నేతల మధ్య గొడవలు జరగకుండా ఇపుడే జాగ్రత్తలు తీసుకోవాలని అనుకున్నారట. అందుకని తానే యాక్టివ్ రోల్ పోషిస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవని హెూంశాఖ మంత్రికి అనిపించిందట. అంతా బాగానే ఉందికానీ అసలు పార్టీకి క్షేత్రస్థాయిలో బలమెక్కడుందో ఎవరికీ అర్ధంకావటం లేదు. 119 నియోజకవర్గాల్లో పార్టీ జెండాలను మోసేంత కార్యకర్తల బలం లేనేలేదు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చోవటం ఓటర్లను బూత్ లకు తరలించి ఓట్లేయించుకునే యంత్రాంగమే పార్టీకి సరిపడా లేదు. ఇక అన్నీ నియోజకవర్గాల్లోను గట్టి అభ్యర్థుల సంగతి మాట్లాడు కోవాల్సిన అవసరమే లేదు. వాస్తవాలు ఇలాగుంటే వచ్చేఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేస్తుందని అమిత్ షాకు ఎలాగ అనిపించిందో అర్ధం కావటంలేదు. అమిత్ తెలంగాణాలో యాక్టివ్ అయితే పార్టీ పవర్లోకి వచ్చేస్తుందా ? ఏమిటో అంతా మాయగా ఉంది.

## సంపాదకీయం

# సద్దాం పాలనే బెటర్..

## గళమెత్తిన ఇరాక్ ప్రజలు

ఇరాక్. పాకిస్థాన్ దేశానికి సమీపంలో ఉన్న ముస్లిం కంట్రీ. అయితే.. ఇక్కడ సద్దాం హుస్సేన్ నియంతలా వ్యవహరిస్తున్నారని.. పేర్కొంటూ.. 2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్.. ఇరాక్పై దండెత్తారు. అంతేకాదు.. అప్పటి ఇరాక్ పాలకుడు.. సద్దాం హుస్సేన్ను చంపి.. అక్కడ అమెరికా పాలనను ప్రారంభించారు. నిజానికి అమెరికా ప్రమేయాన్ని నిలువరించడమే ఇరాక్ అధిపతిగా .. సద్దాం చేసిన ప్రయత్నం. ఈ కసితోనే కక్షగట్టిన .. అమెరికా.. సద్దాంను చంపే వరకు కూడా నిద్రపోలేదు. ఇరాక్ను హస్త గతం చేసుకోవడం ద్వారా.. చమురు నిల్వలను సొంతం చేసుకునే పన్నాగం కూడా ఉందని.. అప్పట్లో విశ్లేషణలు వచ్చాయి. అయినప్పటికీ.. అమెరికా తన పంతాన్ని నెగ్గించుకునేందుకు.. ఇరాక్ వద్ద.. అంటే.. సద్దాం వద్ద.. సామూహిక జన హనన ఆయుధాలు ఉన్నాయని.. వీటిని ప్రయోగించే అవకాశం ఉందని ఇది ప్రపంచానికి పెను సవాల్ వంటిదని పేర్కొంటూ.. ఏకపక్షంగా దాడులు చేసింది. అయితే.. యుద్ధం ముగిసింది.. బంకర్లో దాక్కున్న సద్దాంను అమెరికా సేనలు మట్టుబెట్టాయి. ఆయన శిలా విగ్రహాలను పెళ్లగించాయి. కట్ చేస్తే.. 2003లో అమెరికా అప్రకటిత పాలనలోకి ఇరాక్ వెళ్లిపోయింది. మరి అగ్రరాజ్యం కనుసన్నల్లో ఇరాక్ అభివృద్ధి చెందిందా? ఇప్పటికి 20 ఏళ్లు పూర్తయ్యాయి. మరి ఈ 20 ఏళ్లలో ఇరాక్ ఏమేరకు పుంజుకుంది? అనే ప్రశ్నలు సహజంగానే తెరమీదికి వస్తాయి. దీనిపై ఇటీవల గాలప్ ఇంటర్నేషనల్ సంస్థ ఓ సర్వే చేపట్టింది. దీనిలో అనేక మంది ఇరాక్ పౌరులు భాగస్వామ్య మయ్యారు. వీరు తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించారు. సద్దాం హుస్సేన్ పాలనను పడగొట్టడానికే అమెరికా దండయాత్ర చేసిందని సర్వేలో పాల్గొన్న 29 శాతం మంది పేర్కొన్నా రు. అమెరికా నేతృత్వంలో 2003 నుంచి దేశం పరిస్థితి అధ్వాన్నంగా మారిందని మెజారిటీ ప్రజలు చెప్పడం గమనార్హం. అమెరికా దండయాత్రకు ముందుతో పోలిస్తే ఇప్పటి ఇరాక్ పరిస్థితి ఎలా ఉందంటే.. 60 శాతం మంది ప్రస్తుతం దేశం పరిస్థితి బాగా దిగజారిందని చెప్పడం.. అమెరికా దుర్నీతికి నిదర్శనంగా మారింది. ఇక 2003 తర్వాత ఇరాక్లో షియా అరబ్ మెజారిటీ రాజకీయంగా శక్తిమంతంగా మారింది. ఇది సున్నీ కుర్ద్ ఇతర మైనారిటీ కమ్యూనిటీల్లో ఆగ్రహాన్ని పెంచింది. అంటే ఒకరకంగా.. రాజకీయ అస్థిరత కూడా పెరిగిందనే చెప్పాలి. సద్దాం పాలనలో జీవితం బాగుండేదని దాదాపు 54 శాతం మంది సున్నీ ముస్లింలు అభిప్రాయపడ్డారు.

**ఐఎస్ పోయి..** ఇరాక్కు అమెరికాతో పాటు మిత్ర దేశాల నుంచి భారీ మిలటరీ సహాయం అందడంతో 2018లో ఐఎస్ను దేశం నుంచి తరిమికొట్టారు. అప్పటి నుంచి దేశంలో స్థిరత్వం తిరిగొచ్చింది. 2007లో ఇరాక్లో అమెరికా సైనికుల సంఖ్య అత్యధికంగా 170000గా ఉండేది. ఇప్పుడు వారి సంఖ్య దాదాపుగా 2500గా ఉంది.

**యువత పరిస్థితి దారుణం?** ఇరాక్లో యువత భవిష్యత్ అంధకారంలో ఉందని తెలుస్తోంది. 2019లో బాగ్దాద్ వీధుల్లో ప్రారంభమైన అక్టోబర్ సోషల్ ఉద్యమాన్ని అణిచివేశారు. ఇక దేశం వదిలిపోవాలనే ప్రయత్నాల్లోనూ ప్రజలు ఉండడం గమనార్హం. 25 శాతం మంది ప్రజలు దేశంలో ఉండడానికి ఇష్టపడడం లేదు. అయితే 47 శాతం మంది ప్రజలు మాత్రం.. ఇక్కడే ఉండి దేశాన్ని పునర్నిర్మించాలని భావిస్తున్నారు.

# అడ్డుకట్ట పడేనా?




జగిత్యాల : గంజాయి సాగు, సరఫరాపై కఠిన చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయాలని పోలీసుల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అక్రమ రవాణా, అక్కడక్కడా సాగు కూడా జరుగుతోంది. జిల్లాలో గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఏ మేరకు సఫలీకృతం అవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 28వ తేదీన హైద్రాబాద్‌లో సీఎం కేసీఆర్ పోలీసు, ఎక్సయిజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాల వాడకాన్ని సమూలంగా నిలిపివేయాలని, గంజాయి సాగు చేసే గ్రామాలకు రైతుబంధు, సబ్సిడీలు బంద్ చేయాలని, డ్రగ్స్‌ఫ్రీ గ్రామాలకు ప్రత్యేక ఫండ్స్, ప్రోత్సాహకాలు ఇవ్వాలని, డ్రగ్స్ దందా చేసేవారిపై పీడీయాక్టు, కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ధేశం చేశారు. డ్రగ్స్ కంట్రోలు చేయడంలో చురుకుగా వ్యవహరించిన అధికారులకు ఆగ్జిలరీ ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతో ఎక్సైజ్ పోలీసు అధికారుల దృష్టి డ్రగ్స్ కంట్రోల్ చేయడంపై పడింది. ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇరత రాష్ట్రాల నుంచి సరఫరా

జగిత్యాల జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి జోరుగా రవాణా అవుతోంది. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ మీదుగా జగిత్యాల జిల్లాకు గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతుందన్న ఆరోపణలున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా డబ్బాలలో నింపి రవాణా చేస్తున్నారని తెలుస్తోంది. గంజాయి నుంచి పొడి వేరు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు అనుమానాలున్నాయి. నాణ్యతను బట్టి గ్రాముకు రూ. 500 నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇతర జిల్లాలు, రాష్టాలకు చెందిన కొంత మంది వ్యక్తులను నియమించుకొని వారితో అక్రమ వ్యాపారం, రవాణా చేయిస్తున్నారు.

జిల్లాలో గంజాయి కేసులు జిల్లాలో గడిచిన మూడేళ్లలో గంజాయి కేసులు జోరుగా నమోదయ్యాయి. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో మూడేళ్లలో 25 గంజాయి కేసులు నమోదయ్యాయి. ఇందులో 68 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 44.365 కిలో గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఇందులో 2019 సంవత్సరంలో 3 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేయగా, వీరి వద్ద 4.200 కిలో గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. 2020 సంవత్సరంలో 8 కేసులు నమోదు కాగా 18 మంది అరెస్టు అయి వీరి వద్ద 10 కిలో గంజాయి పట్టుపడింది. 2021 సంవత్సరంలో 14 కేసులు నమోదు కాగా 38 మంది అరెస్టు అయి 30.165 కిలో గ్రాముల గంజాయి పట్టుపడింది.గంజాయి మత్తులో యువత

జిల్లాలో గంజాయి మత్తులో యువత జోగుతోంది. గంజాయి రవాణా, విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. గంజాయి లభించని సందర్భాల్లో యువత మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే మత్తు పదార్థాలను సేవిస్తున్నట్లు తెలిస్తోంది. ప్రధానంగా హుక్కాషాట్, బాటిల్ షాట్, ఓసీబీ పేపర్, మెడికల్ దుకాణాల్లో లభించే వైట్‌నర్ లాంటివి సేవిస్తున్నారు. దీంతో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల జిల్లాకు ప్రధానంగా మంచిర్యాల, నిర్మల్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి గంజాయి సరాఫరా అవుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన గంజాయిని జగిత్యాల ప్రాంతంలో కొందరు వ్యక్తులు రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులు వీటిని పాత కార్లలో స్టీరింగ్ కింద, సీట్ల కింద, స్టెపిన్ టైర్లలో, పాత స్కూటర్ల డిక్కిల్లో పోలీసులకు అనుమానం రాకుండా రవాణా చేస్తున్నారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగవుతుందన్న ఆరోపణలున్నాయి.

అక్రమార్కులకు నేతల అండదండలు

జిల్లాలో గంజాయి, గుడుంబా, పేకాట, గుట్కా తదితర అక్రమాలలో కొందరు పలుకుబడి గల వ్యాపారులు, నేతల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ అధికార పార్టీకి చెందిన నాయకునిగా చలామణి అవుతున్న వ్యాపారి ఒకరు తనకున్న పరిచయాలతో అక్రమ వ్యాపారులకు సహకారం అందిస్తున్నట్లు విమర్శలున్నాయి. ప్రతి నిత్యం పోలీసు అధికారుల చుట్టూ, ఠాణాల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్న కొందరు వ్యక్తులు అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతోనైనా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగానికి అడ్డుకట్టపడుతాయా, లేదా అన్నది వేచి చూడాల్సిందే.

# కార్మికక్షేత్రంలో పరుచుకున్న పచ్చదనం

ఆదిలాబాద్ :సింగరేణి కార్మిక కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో పచ్చదనం పరుచకపోయింది. ఒక్కొక్క మొక్క నాటి గోలేటిని హరిత తోరణంలా తలపించే విధంగా తీర్చిదిద్దారు. అందుకే ఓ చక్కటి నినాదం ఉంది. అదే సృష్టిలో మనిషి తలుచుకుంటే సాధించనిది ఏమి లేదన్నట్లుగా ఇక్కడ నల్ల నేలలో పచ్చదనం అందాలు కన్పిస్తుంటాయి. ఒకప్పుడు వృథాగా ఉన్న నేలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి ప్రాంతంలో ఎక్కడ చూసిన హరిత తోరణాలతో స్వాగతం పలుకుతాయి. యాజమాన్యం పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనగడ సాధ్యమన్న విషయాన్ని గ్రహించి లక్షల సంఖ్యలో మొక్కలు నాటి వృక్షాలుగా మార్చారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసి ప్రజానీకనానికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. కాలుష్య నివారణతో పాటు కార్మిక కుటుంబాలు ఆహ్లాదకరం.. ఆనందాన్ని పొందుతున్నారు.

పచ్చని చెట్లు పకృతి అందాల ఉద్యావవనం

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉద్యానవనం పచ్చని చెట్లతో నిండుకపోయింది. రకరకాల మొక్కలతో పాటు సువాసన వెదజల్లే పూల మొక్కలు సందర్శకులను ఆకర్శించే విధంగా ఏర్పాటు చేసిన మొక్కలు చూస్తే చాలు కాసేపు సేద తీరాలన్పింస్తుంది. ఉద్యానవనంలోకి కాలుమోపగానే పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతాయి. నిత్యం చిన్న పిల్లలతో పాటు పెద్దలు కాలక్షేపం కోసం అలా పార్కుకు వస్తుంటారు. ఎత్తైన చెట్లను ముచ్చటించే పూలను చూస్తే ఇలా పులకరింపజేస్తాయి. హారితహారాన్ని సంరక్షించుకోవడానికి సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి, కాంట్రాక్టు కార్మికులతో పని చేయిస్తుంటుంది. కార్మిక వాడల్లో మధ్యలో ఉన్న ఉద్యానవనం పచ్చదనంతో నిండిపోయింది.

శుభాకార్యాలకు వచ్చే

గోలేటిలోని సీఈఆర్ క్లబ్, షటిల్ కోర్టు, ఆఫీసర్ క్లబ్, గెస్టు హౌజ్, కార్మికుల క్వార్టర్లు పచ్చని చెట్లతో ఆకర్శిస్తాయి. క్లబ్‌లలో శుభాకార్యాలయాలు చేసుకునే వారికి ఆహ్లాదకరమైన వాతావరణంతో పలుకరిస్తాయి. సీఈఆర్ క్లబ్‌లోకి వెళ్లే ముఖ ద్వారం వద్ద నుంచి మొదలుకొని భవనంలోకి వెళ్లే వరకు ఇరువైపుల పచ్చని చెట్లు చక్కటి నీడ ఇస్తాయి. పంక్షన్‌కు వచ్చే అతిథులకు మంచి అనుభూతిని అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపుతుంది. ఏది ఏమైన ప్రతి ఒక్కరూ పర్యావర పరిరక్షణ కోసం మొక్క నాటినప్పుడే మానవళికి మనుగడ ఉంటుందనే ఆలోచన గోలేటి కార్మిక వాడల్లో కనబడుతుంది. సింగరేణి డిస్పెన్సరీ, కార్మిక వాడల్లో రహదారికి ఇరువైపుల పెరిగిన చెట్లు చక్కటి వాతావరణాన్ని అందిస్తున్నాయి. రెండేళ్ల క్రితం శ్రీ భీమన్న ఆలయానికి వెళ్లే రహదారి పక్కన మొక్కలు నాటారు. అవి భవిష్యత్తులో వృక్షాలుగా మారి, భక్తులకు నీడను అందించనున్నాయి.

గోలేటిలోని కోదండ రామాలయం ఆవరణలో ఉన్న చెట్లు చల్లటి నీడతో పాటు మంచి వాతావరణాన్ని అందిస్తాయి. నిత్యం మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు, పూజల అనంతరం కాసేపు చెట్ల కింద సేద తీరుతుంటారు. పచ్చని మొక్కలతో మానవళికి మనుగడ అన్న విషయం మర్చిపోవద్దు అనే విధంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు.

జీఎం కార్యాలయం ఆవరణలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణ పచ్చని చెట్లతో నిండిపోయింది. జీఎం కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు వస్తున్న ఉద్యోగులకు చల్లటి వాతావరణాన్ని అందించేందుకు చెట్లను పెంచుతున్నారు. జీఎం కార్యాలయం ముందు భాగమే కాకుండా ప్రాంతమంతా సంచరించుకపోయింది. ఎండలో వచ్చే ఉద్యోగులు కాసేపు చెట్ల కింద సేద తీరిన తర్వాతే కార్యాలయానికి వెళ్లాలనే అనే ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం లభిస్తుంది. ఎక్కడ చూసిన పచ్చని శోభతో ఉద్యానవనంలా తలపించేలా దర్శమిస్తుంది. జీఎం బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో ఈ ఏడాది మరిన్ని పూల మొక్కలు పెంచుతున్నారు.

# సింగరేణి.. యువ బాణీ

గోదావరిఖని : సింగరేణిలో నవతరం ఉరకలెత్తుతోంది.. ఏడేళ్లలో 16 వేల మంది కొత్త ఉద్యోగులు చేరారు.. పాతికేళ్లుగా ఉద్యోగ నియామకాలు నిలిపివేసిన సింగరేణి పాతతరం కార్మికులతోనే పనులు చేపట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారసత్వ ఉద్యోగాలతో పాటు ప్రతిభ ఆధారంగా నియామకాలతో సింగరేణి యువతరంతో నిండిపోయింది. సింగరేణిలో ప్రస్తుతం 42,534 మంది పనిచేస్తుండగా ఇందులో 16,042 మంది యువకులే ఉన్నారు. వీరంతా 40 ఏళ్ల లోపు వారే. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు యువరక్తం సింగరేణికి భవిష్యత్తులో సేవలందించే అవకాశం ఉంది. కనీస విద్యార్హత లేకుండానే సింగరేణిలో పనులు చేసే కార్మికులున్న స్థాయి నుంచి ఉన్నత విద్యావంతులు కూడా చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. సింగరేణి సంస్థ 1995 నుంచి నియామకాలు నిలిపివేసింది. పాతికేళ్లుగా ఒక్క నియామకం చేపట్టలేదు. పదేళ్ల క్రితం వరకు సింగరేణిలో 50 ఏళ్లు దాటిన వారే ఎక్కువగా ఉన్నారు. చాలా మందికి కీళ్ల నొప్పులు.. ఎముకలు అరగడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ విధులు నిర్వహించేవారు. చాలా మంది కార్మికులు మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయి తమ వారసులకు ఉద్యోగాలు పెట్టించారు. దీంతో సింగరేణిలో ఏడేళ్లలో ఒక్కసారిగా యువ ఉద్యోగులు పెరిగారు.

ఉన్నత విద్యావంతులు : సింగరేణిలో ప్రస్తుతం ఎక్కువ శాతం మంది ఉన్నత విద్యావంతులు సంస్థలో పనిచేస్తున్నారు. కొత్తగా చేరిన వారంతా ఉన్నత విద్యను అభ్యసించినవారే. ఇందులో మహిళా ఉద్యోగులు కూడా ఉన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారంతా ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ, డిప్లొమా, ఐటీఐ విద్యావంతులు ఎక్కువ శాతం మంది ఉన్నారు. సింగరేణిలో ప్రస్తుతం 'తట్టా చెమ్మస్' విధానం లేకపోవడంతో యువ ఉద్యోగులు ఎక్కువ శాతం చేరేందుకు ముందుకొస్తున్నారు. తండ్రుల వారసత్వంగా ఉపాధి పొందేందుకు మొగ్గు చూపుతున్నారు. భూగర్భంలోనూ యంత్రాల ద్వారానే పనులు చేపడుతుండటంతో సులభతరంగా మారింది. సింగరేణిలో ఒక దశలో కనీస అక్షరాలు కూడా తెలియని కార్మికులు పనిచేశారు. వేలిముద్ర వేసి వేతనాలు తీసుకునే స్థాయిలో సింగరేణిలో పనిచేశారు. దీంతో సింగరేణి యాజమాన్యం కార్మికులకు చదువు నేర్పించేందుకు గనులపై అక్షరాభ్యాసం చేయించారు. కాలనీల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం అందులోంచి బయటకు వచ్చిన సింగరేణి యువ ఉద్యోగులతో నిండిపోయింది. మరిన్ని కొత్త నియామకాలుసింగరేణిలో మరిన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు కొత్త నియామకాలు చేపట్టనుంది. 2014 నుంచి ఇప్పటి వరకు 58 నోటిఫికేషన్‌లను విడుదల చేసి బయటి వారిని భర్తీ చేసుకున్న సింగరేణి మరికొన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇదివరకు సాంకేతిక ఉద్యోగులు, సంక్షేమ అధికారులు, క్లరికల్ ఉద్యోగులను విద్యార్హతల ఆధారంగా చేర్చుకుంది. వీరితో పాటు కారుణ్య నియామకాల ద్వారా వారసులకు సంస్థలో ఉద్యోగాలు కల్పించింది. కొత్తగా ఏర్పడ్డ ఖాళీలను మరోసారి నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టనుంది.

# విద్యార్థుల భోజనంపై ఫోకస్

నిర్మల్: గతవారం రోజుల నుంచి పలు విద్యాసంస్థల్లో అక్కడి విద్యార్థులకు అందించే భోజనాలు వికటిస్తున్న సంఘటనలపై సంబంధిత ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పొరుగుజిల్లాల్లోని విద్యాసంస్థల్లో కూడా ఆహారం వికటించి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్న నేపథ్యంలో యంత్రాంగమంతా ఇటువైపే ఫోకస్ పెట్టింది. జిల్లాలోని ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో గత రెండు, మూడు రోజుల నుంచి విద్యార్థులకు అందించే భోజనంలో కప్పలు, బొద్దింకలు లాంటి వాటి అవశేషాలు బయటపడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనల కారణంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అక్కడి హాస్టల్‌లో భోజనం చేసేందుకు జంకుతున్నారు. ఈ వ్యవహారం ఇలా కొనసాగుతుండగానే ఉ మ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు ఆసుపత్రుల పాలైన సంఘటనలు వెలుగు చూశా యి. ముఖ్యంగా కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్‌లతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న భోజనం నాణ్యత లేకుండా ఉం టోందన్న ఆరోపణలున్నాయి. ఇలా నాణ్యత లేని ఆహారం తింటూ విద్యార్థులు తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలుప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ ఇలా ఆహారం వికటించి అస్వస్థతకు గురైన సంఘటనలు వరుసగా వెలుగుచూస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అలర్ట్ అవుతున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో వెలుగుచూస్తున్న సంఘటనలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక అధికారులను విచారణ కోసం రంగంలోకి దించింది. అలాగే కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఆ భోజనం కోసం ఉపయోగించిన ఆహారదినుసుల నాణ్యతను పరిశీలించేందు కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. సంబంధిత హెడ్మాస్టర్‌లకు సైతం జిల్లా విద్యాశాఖ అధికారి ఇప్పటికే మధ్యాహ్న భోజనంకు సంబంధించి మార్గదర్శకాలను జారీచేశారు. ప్రతిరోజూ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం కోసం ఓ టీచర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించాలని అలాగే హెడ్మాస్టర్‌లు మధ్యాహ్న భోజనంకు సంబందించి వంట మొదలైనప్పటి నుంచి పిల్లలు తినే వరకు పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఇప్పటికే హెడ్మాస్టర్‌లందరికి సూచనలు జారీ చేశారు. అలాగే ఆకస్మిక తనిఖీలకు సంబంధించి ప్రత్యేకబృందాలు రంగంలోకి దిగబోతున్నాయన్న సంకేతాలను సైతం హె డ్మాస్టర్‌లకు అందించారు. మధ్యాహ్న భోజనంలో వినియోగించే కూరగాయలను శుభ్రం చేయాలని అలాగే పిల్లలందరు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కునే విధంగా ఉపాధ్యాయులు చూడాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు బియ్యం, వంటసామాగ్రి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. భోజనం తరువాత బడి పిల్లలను పరిశీలించాలంటూ కూడా అధికారులు తమ ఆదేశాల్లో సంబందిత హెడ్మాస్టర్‌లను కోరారు. వరుస సంఘటనలతో హై అలర్ట్‌కాగా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లాలో కూడా చోటు చేసుకుంటుండడంతో సంబంధిత అధికారులంతా అలర్ట్ అవుతున్నారు. ముఖ్యంగా కస్తూరిభా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్కడి ప్రత్యేక అధికారులకు మధ్యాహ్న భోజనంపై నిర్దిష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నారు. దీంతో పాటు సెక్టోరియల్ అధికారులను కూడా అప్రమత్తం చేసి ఆకస్మిక తనిఖీలతో పాటు నిరంతర తనిఖీల కోసం షెడ్యూల్‌ను రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. రెసిడెన్షియల్‌స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సంబంధిత ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్‌లు మధ్యాహ్న భోజనంను పకడ్బందీగా చేపట్టాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎలాంటి సంఘటనలు జరి గినా సంబంధిత ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్‌లదే బాధ్యత అవుతుందని అలాగే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఇన్‌చార్జ్ కూడా బాధ్యత వహించాల్సి వస్తుందంటూ ఆదేశాలు వెలువరించారు. రంగంలోకి ప్రత్యేక బృందాలుజిల్లావ్యాప్తంగా కస్తూరిభా పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్, మండ ల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం పథకంను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. ఈ మేరకు ఈ బృందాలను మండలాల వారీగా నియమించారంటున్నారు. ఆకస్మిక బృందాలు మధ్యాహ్నభోజనం కోసం వినియోగిస్తున్న కూరగాయలను, ఇతర ఆహార దినుసులను అలాగే మధ్యాహ్న భోజనం చేసే వంటగదుల వద్ద ఉన్న వాతావరణాన్ని పరిశీలించనున్నారు. అలాగే పిల్లలు భోజనం చేసే సమయంలో ఎలాంటి పరిశుభ్రతను పాటిస్తున్నారోననే అంశాన్ని కూడా వీరు గమనించనున్నట్లు చెబుతున్నారు. తాగునీరు విషయంలోనూ, వంట పాత్రల శుభ్రత విషయంపై కూడా వీరు తెలుసుకోనున్నారు. తమ తనిఖీల్లో లోపాలు వెలుగుచూస్తే సంబంధిత పర్యవేక్షకులపైనే చర్యలు తీసుకుంటామంటూ కూడా హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఆకస్మిక బృందాలు ప్రతిరోజూ తమకు కేటాయించిన మండలాల్లో కనీసం నాలుగైదు పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు సమాచారం. దీనికోసం గాను స్పెషల్‌డ్రైవ్ ను చేపట్టబోతున్నట్లు విద్యా?శాఖ అధికారులు పేర్కొంటున్నారు. బాసర ట్రిపుల్ ఐటీ ఘటనతో అప్రమత్తం బాసర ట్రిపుల్‌ఐటీలో వరుసగా చోటు చేసుకున్న సంఘటనలపై కూడా జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీ హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహారం కలుషితమైందే కాకుండా ఆ ఆహారంలో కప్పలు, పురుగులు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. దీంతో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులందరు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అలాగే ట్రిపుల్‌ఐటీ అధికారులతో జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై ఆరా తీసినట్లు తెలిసింది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలుడాక్టర్ రవీంధర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అ?ధికారి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి కే అన్ని పాఠశాలలకు నాణ్యతపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశాం. కేజీబీవీల్లో ప్రత్యేకాధికారులే మధ్యాహ్న భోజనం బాధ్యతలను పూర్తిగా పర్యవేక్షించాలి. అలాగే పాఠశాలల్లో సంబంధిత హెడ్మాస్టర్‌లు పకడ్బంధీగా పర్యవేక్షించాలి. అలాగే కూరగాయలను శుభ్రం చేసి వంటకు ఉపయోగించాలి. భోజననిర్వహకులకు కూడా స్పష్టమైన ఆదేశాలు అందించాలి. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులందరికి మధ్యాహ్న భోజన మార్గదర్శకాలపై స్పష్టమైన ఆదేశాలు అందించాం. మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నాం.

# ఇంటింటా ఓటరు సర్వే

కరీంనగర్ : రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలు వ్యూహారచనలు చేస్తున్నాయి.. ఎన్నికల సంఘం కూడా అందుకు అనుగుణంగా ఇంటింటా ఓట్ల పరిశీలన, కొత్త వారి నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, సవరణలు చేపట్టే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈనెల 25 నుంచి శ్రీకారం చుట్టగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి పాలనాధికారి, అదనపు పాలనాధికారి, ఇతర అధికారులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో కూడా ఆర్డీవో ఆనంద్‌కుమార్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, సహాయ ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఆధార్ కార్డుతో అనుసంధానం వంటివి కొనసాగుతున్నాయి.

నమోదు.. పరిశీలన

అన్ని నియోజకవర్గాలలో బీఎల్వోలు ఈనెల 25 నుంచి ఇంటింటా పరిశీలన ప్రారంభించారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 23 వరకు కొనసాగుతుంది. అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారితో



ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. రెండు ఓట్లు కలిగి ఉన్న వారితో మాట్లాడి ఒక ఓటు ఉండేలా దరఖాస్తు తీసుకుంటారు. చనిపోయిన వారి వివరాలు సేకరించి వాటిని తొలగించే చర్యలు చేపడతారు. ఓటు ఉండి వలస వెళ్లిన వారి వివరాలు సేకరిస్తారు. ఆధార్‌తో అనుసంధానం చేసుకునేలా ప్రోత్సహిస్తారు.

అక్టోబరు 4న తుది ఓటరు జాబితా

అన్ని రకాలుగా వచ్చిన దరఖాస్తులను జులై 25 నుంచి 31 వరకు పరిశీలన పూర్తి చేసి అక్టోబరు 1 నాటికి అర్హులైన వారిని జాబితాలో చేర్చడానికి అంతర్జాలంలో వివరాలు నమోదు చేస్తారు. వీటి ఆధారంగా ఆగస్టు 2న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. అదే నెల 2 నుంచి 31 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ మధ్యలో ఓటరు నమోదు, తొలగింపు, మార్పులపై రెండు శనివారాలు, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 22న అభ్యంతరాలపై వివరణ ఇస్తారు. అక్టోబరు 4న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు

జూన్ 24 నుంచి జులై 24 వరకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, వాటి సౌకర్యాలను పరిశీలిస్తారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓటర్లు ఉండేలా సరి చూసుకుంటారు. అవసరమైన చోట కొత్త కేంద్రాలను ఏర్పాటుకు ఫొటోలతోపాటు ప్రతిపాదనలు పంపిస్తారు.

ఆధార్, మొబైల్ నంబరు నమోదు చేయించాలి– జి.శ్యాంప్రసాద్‌లాల్, అదనపు పాలనాధికారి, కరీంనగర్

ఇంటింటా సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. 18 ఏళ్లు నిండిన వారందరికి ఓటు హక్కు కల్పిస్తాం. ప్రతి ఓటరు ఆధార్, మొబైల్ నెంబర్ నమోదు చేయించాలి. నియోజకవర్గాల వారీగా జరిగే సర్వేలో ఎన్నికల సిబ్బందికి సహకరించాలి.

# పౌష్టికాహారం పంపిణీలో ప్రత్యేక ముద్ర

కరీంనగర్ : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం.. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటి ఆధ్వర్యంలో ప్రభుత్వం నెల నెలా కోడిగుడ్డు, ఇతర పౌష్టికాహార సరకులు పంపిణీ చేస్తోంది. అయితే కొందరు అక్రమార్కుల దాహార్తితో అవి పక్కదారి పడుతున్నాయి. మరోవైపు కుళ్లిన, చిన్న పరిమాణం కలిగిన గుడ్లు సరఫరా చేస్తుండటంతో చెత్త పాలవుతున్నాయి. ఈ క్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ గుడ్డు' అని రాసి ఉన్న ముద్ర వేస్తున్నారు. జూన్ నెలలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

పక్కదారి పడుతున్న సరకులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం, గుడ్డు, ఆరేళ్లలోపు వారికి గుడ్డు, పప్పు, కూరగాయల భోజనం, కురుకరే అల్పాహారం, బలవర్ధకమైన పల్లీ పట్టీలు అందిస్తున్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో ప్రతి రోజూ 200 మి.లీ.ల పాలు సరఫరా చేస్తున్నారు. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న లబ్ధిదారులకు రెట్టింపు స్థాయి పౌష్టికాహారం పంపిణీ అవుతోంది. అయితే అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండటంతో సిబ్బంది సరకులను పక్కదారి పట్టిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. కుళ్లిన గుడ్డు, చిన్న పరిమాణం అంగన్‌వాడీ లబ్ధిదారులకు కోడిగుడ్డు పంపిణీలో పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. చాలా చోట్ల కేంద్రాలకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రావడం లేదు. లబ్ధిదారుల పేరిట నెలనెలా వస్తున్న కోడిగుడ్డు, ఇతర సరకులను సిబ్బంది మింగేస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు నాణ్యమైన గుడ్డు సరఫరా చేయడం లేదు. కుళ్లిపోయిన, చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లను తినేందుకు లబ్ధిదారులు నిరాసక్తత కనబరుస్తున్నారు.

కొన్ని చోట్ల కేంద్రాలకు తీసుకురాకుండానే సిబ్బంది గుడ్డును అమ్ముకుంటున్నారు. నెలలో మూడు రంగుల్లో.. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 3,135 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వీటిలో 3,050 ప్రధాన, 85 మినీ కేంద్రాలున్నాయి. మూడేళ్లలోపు పిల్లలు ఒక లక్ష, మూడు నుంచి ఆరేళ్లలోపు 76,100 మంది చిన్నారులు, 39 వేల మంది గర్భిణులు, బాలింతలు నమోదయ్యారు. కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తోంది. నెలలో పది రోజులకోసారి కోడిగుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్రను వేస్తోంది. మొదటి విడతలో నీలి, రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుల్లో 'అంగన్‌వాడీ గుడ్డు' మధ్యలో జోన్–1 అని ముద్రించారు. రాష్ట్ర వ్యాప్తంగా అయిదు జోన్ల పరిధిలో గుత్తేదారులకు బాధ్యతలు ఇచ్చారు.

# అవస్థల పయనం.. మరమ్మతులు గగనం



వరంగల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారి(353సి) అస్తవ్యస్తంగా మారింది.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. అసంపూర్తిగా పనులను చేపట్టడం, అటవీ అనుమతులు సాధించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నా నిర్మాణ పనులు అసంపూర్తిగా, నాణ్యత లేకుండా చేపడుతున్నారు. దీంతో కొన్ని రోజులకే రహదారి మొత్తం దెబ్బతిని గుంతలమయంగా మారుతోంది. ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అందులో ముఖ్యంగా కాళేశ్వరం నుంచి ఇసుక లారీలు, భూపాలపల్లి నుంచి బొగ్గు లారీలు, కేటీపీపీ నుంచి బూడిద లారీలు అధిక లోడుతో ప్రతిరోజు కొన్ని వందల సంఖ్యలో వెళ్తాయి. దీంతె రోడ్డంతా గుంతలమయంగా మారింది. కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వెళ్లేదారి ఇదే కావడంతో హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వాహదారులు ఈ రహదారి మీదుగానే ప్రయాణించాలి. ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసేవారే కరవయ్యారు. నిత్యం ప్రమాదాలు జరిగి ప్రజలు మరణిస్తున్నా చూసీచూడనట్లు సంబంధింత అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల గ్రామస్థులు, యవకులు శ్రమదానంతో గుంతలను మట్టితో పూడ్చే ప్రయత్నం చేసిన సందర్భాలు ఉన్నాయి. జాతీయ రహదారిపై ఇన్ని గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నా ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు ముంచెత్తుతోంది.. ఈ చిత్రంలో కనిపిస్తున్నది రేగొండ మండల కేంద్రంలో జాతీయ రహదారికి సంబంధించి నిర్మించిన మురుగుకాల్వ.. నిర్మాణం మధ్యలోనే నిలిపివేయడంతో వర్షం కురిసిన ప్రతిసారీ వరద రోడ్డుపైకి పారుతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు ఇళ్లలోకి వస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అటవీ అడ్డంకులు

ఇక్కడ కనిపిస్తున్నది మహదేవ్‌పూర్ నుంచి కాళేశ్వరం వెళ్లే రహదారి. 15 కి.మీ మేర అటవీ ప్రాంతం కావడంతో అటవీ అనుమతులు రావడం లేదు. రహదారి విస్తరణలో ఎన్ని చెట్లు పోతాయో లెక్కించి గుర్తులు పెట్టారు. అలాగే 2 కి.మీ మేర రహదారి నిర్మాణానికి కాళేశ్వరం గ్రామస్థులు భూములు కోల్పోవాల్సి రావడంతో తమ భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు.

నత్తనడక.. నాసిరకం

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్‌లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాసిరకంగా చేపడుతుండటంతో మురుగు కాల్వలపై ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు పగిపోతున్నాయి. ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. పనులు చేపడుతున్న ప్రదేశంలో నీరు చల్లకపోవడంతో దుమ్ముతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుంగిన దారి..

కాటారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు కుంగిపోయి ఒక వైపు ఎత్తుగా మారింది. దీంతో చిన్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయరహదారి పక్కన నిర్మించిన మురుగు కాల్వలు అసంపూర్తిగా ఉండటంతో వర్షపు నీరు రోడ్డుపైకి వస్తోంది.

గుత్తేదారుదే నిర్వహణ బాధ్యత..– విద్యాసాగర్, ఈఈ, వరంగల్

జాతీయ రహదారి మరమ్మతు పనులు చేపడుతున్నాం. గుత్తేదారు నాలుగేళ్లపాటు మరమ్మతు పనులు చూసుకోవాల్సిందే. భూపాలపల్లి నుంచి చెల్పూర్ వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. మహదేవ్‌పూర్ నుంచి కాళేశ్వరం రహదారి పనులకు సంబంధించి టెండర్ పూర్తయి గుత్తేదారు సిద్ధంగా ఉన్నారు. అటవీ అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

# ధాన్యం సొమ్ముకు అన్నదాతల ఎదురుచూపులు



జనగామ : జిల్లాలో ఏప్రిల్ చివరి నుంచి జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఐకేపీ కేంద్రాల నుంచి జిల్లాలో ఎంపిక చేసిన 38 రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిన రైతుల ఖాతా, ఇతర వివరాలతో జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయానికి పంపించిన తర్వాత ప్రభుత్వం పౌరసరఫరాల శాఖకు ఇస్తున్న డబ్బుల ఆధారంగా రైతులకు సొమ్ము చెల్లిస్తున్నారు.

1.11 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల సేకరణ

ఏప్రిల్ చివరి వారం నుంచి జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో మొత్తం 195 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది యాసంగి లక్ష్యంగా 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాటికి 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటికే 35 కేంద్రాల పరిధిలో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవడంతో కేంద్రాలను ఎత్తివేశారు. మరో 165 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రాకుండా కలెక్టర్ శివలింగయ్య ఆధ్వర్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటిస్తూ.. కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపు, తరుగు తీత.. తదితర విషయాల్లో మిల్లర్లకు కచ్చితమైన నిబంధనలు విధించారు. ధాన్యంలో ఇష్టానుసారంగా తరుగు తీయకుండా పౌరసరఫరాలశాఖ అధికారులే కాకుండా వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్, వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం తదితరులు కూడా రైస్‌మిల్లులను తనిఖీ చేస్తుండడం గమనార్హం.

చెల్లించాల్సింది రూ.128 కోట్లు

జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి అక్కడి రైస్‌మిల్లులకు, ఆ తర్వాత జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి ధాన్యం సొమ్ము చెల్లింపు కోసం రైతుల వివరాలను పంపిస్తున్నారు. శుక్రవారం నాటికి రైతులకు ఇంకా రూ.128 కోట్ల సొమ్ము చెల్లించాల్సి ఉంది. జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో రూ.41 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా రూ.87 కోట్ల సొమ్ము.. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం నుంచి జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయానికి వస్తున్న డబ్బుల ఆధారంగా రైతులకు చెల్లింపులు చేస్తున్నారు. ఒక్కో రైతుకు తన పంట విక్రయించాక సుమారు 15 నుంచి 20 రోజుల్లోగా ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది.

జాప్యం లేకుండా చర్యలు– సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్జిల్లా వ్యాప్తంగా రైతులకు సజావుగా ధాన్యం సొమ్ము చెల్లిస్తున్నాం. రైతుల వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి వస్తున్న డబ్బుల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. రైతులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# స్వచ్ఛ పథం.. ఆదాయ మార్గం

పెద్దపల్లి: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యర్థాలతో ఆదాయ సముపార్జనపై పురపాలికలు దృష్టి సారిస్తున్నాయి. అయితే వ్యర్థాల నిర్వహణ సమస్యగా మారుతుండటంతో ఆ ప్రయత్నాలు అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా మొదలయ్యే ఈ ప్రక్రియలో తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువుల తయారీ కోసం గుంతలు నిర్మిస్తున్నారు. పొడి చెత్త సేకరణలోనూ విభజన ప్రక్రియ జరుగుతుంది. పొడి చెత్త నుంచి ప్లాస్టిక్ కవర్లు వేరు చేయడం.. గాజు, ఇనుప ముక్కలు, పేపర్, అట్టముక్కలు తదితర వ్యర్థాలను వేర్వేరుగా విభజించి, ఆదాయం సముపార్జించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దపల్లిలో స్వచ్ఛతతో పాటు చెత్త సేకరణలో ప్రజల సహకారం కోరుతూ పురపాలిక ఛైర్‌పర్సన్, అధికారులు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రయంపురపాలిక సేకరించిన తడి చెత్తను కంపోస్టు ఎరువుగా తయారు చేసేందుకు డంపు యార్డులో ప్రత్యేక గుంతలు నిర్మించారు. తడి చెత్తను వీటిలో వేసి పూర్తిగా కుళ్లిన తర్వాత సేంద్రియ ఎరువులుగా వినియోగానికి వీలుగా తయారు చేస్తున్నారు.

# ఈత సాగు.. ఉపాధి బాగు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో ఈత వనం సాగు చేపట్టి మంచి ఫలితాలు పొందుతున్నారు. సూక్ష్మ సేద్యం పద్ధతిలో చేపట్టిన సాగు తక్కువ కాలంలోనే గీతకు రావడమే కాకుండా గీత కార్మికులు ఈత నీరా ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు. జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంలో చేపట్టిన ఈత సాగు ద్వారా వంద కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది.

జగిత్యాల జిల్లా అంతర్గాం గ్రామ గీత కార్మికులు ఈత సాగు ద్వారా రెండేళ్లుగా నీరా తయారుచేస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకున్నారు. ఆరేళ్ల కిందట ఐదు ఎకరాల్లో 5 వేల ఈత మొక్కలను ప్రభుత్వ పథకం ద్వారా నాటి సూక్ష్మ సేద్యం పద్ధతిలో సాగు చేపట్టారు. పదేళ్లకు గీతకు వచ్చే చెట్లు బిందుసేద్య పద్ధతిలో ఎరువులు, నీళ్లు నిత్యం అందించడంతో నాలుగేళ్లకే గీతకు వచ్చాయి. దీంతో రెండేళ్లుగా కల్లుగీస్తూ సమీపంలోనే జగిత్యాల పట్టణ వాసులకు నీరా, కల్లును విక్రయిస్తున్నారు. గతంలో ఉపాధి లేక గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు గ్రామానికి తిరిగివచ్చి గ్రామంలోనే ఉపాధి పొందుతున్నారు. ఈత వనం సాగు కోసం స్థానిక నాయకులు మాకునూరి జితేందర్‌రావు



బీజం పోయగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సహకారం అందించారు. ఫలితంగా గ్రామంలో వందకు పైగా కుటుంబాలు రోజూ రూ.2 నుంచి రూ.3 వేల వరకు సంపాదిస్తున్నారు.

నీరాకేఫ్ ఏర్పాటుకు సన్నాహాలు

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నీరా కేఫ్ ఏర్పాటు చేయడంతో మంచి ఫలితాలు ఇస్తున్న నేపథ్యంలో స్థానికంగా అంతర్గాంలోనే నీరా కేఫ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు గీత కార్మిక సంఘ అధ్యక్షుడు గొడిసెల బాలు అన్నారు. ఇప్పటికే షెడ్డు నిర్మాణం జరగగా కేఫ్‌ను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్ది పట్టణ వాసులు ఇక్కడికి వచ్చి నీరా తాగి వెళ్లేలాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళ సేద తీరేందుకు భారీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఇందుకోసం గత కలెక్టర్ రూ.3 లక్షలను మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయని, మోడల్ నీరా కేఫ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మండల స్థాయిలో..–బాలు, గౌడ సంఘ అధ్యక్షుడు

నీరా కేఫ్‌లను హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో జిల్లా నుంచి మండల స్థాయి వరకు ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. దీని ద్వారా గీత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. చాలా మంది గీత కార్మికులకు ఉపాధి లేక వృత్తిని వదులుకొని విదేశాలకు వెళ్లి పనిచేస్తున్నారు. మండల స్థాయిలో నీరా కేఫ్‌లను ఏర్పాటు చేస్తే గీత కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

ప్రభుత్వం సాయం అందించాలి–శ్రీనివాస్ గౌడ సంఘ ఉపాధ్యక్షుడు


ప్రభుత్వం 5 వేల మొక్కలు ఇవ్వడంతో అవి ఇప్పుడు గీతకి వచ్చాయి. నీరాను తీసి పట్టణాలకు పంపిణీ చేయాలనుకుంటున్నాం. ప్రస్తుతం నీరా కేఫ్ ఏర్పాట్లలో ఉన్నాం. ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి సాధ్యం అవుతుంది. ప్రభుత్వం సహాయం చేస్తే చుట్టుపక్కల జిల్లాలకు, మండలాలకు నీరాని అందిస్తాం.

# ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

ఇబ్రహీంపట్నం : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించి.. వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ప్రారంభించింది. ఆయా పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన జరుగుతుంది. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ప్రవేశాలకు మొదట నిర్ణయించిన గడువు ఈ నెల 25తో ముగియగా ఈ నెల 31 వరకు గడువు పెంచారు.

ఉచిత వసతి, భోజనం

ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థుల్లో బాలికలకు మాత్రమే ఉచిత వసతి, భోజన సౌకర్యాన్ని కల్పిస్తారు. దూరం నుంచి వచ్చే వారికి, రవాణా సౌకర్యం లేని వారికి మొదట ప్రాధాన్యం ఇస్తారు. వసతి గృహంలో ఉదయం అల్పాహారంతో పాటు, రెండు పూటల భోజనం, సాయంత్రం స్నాక్స్‌ను అందిస్తారు. రోజు విడిచి రోజు కోడి గుడ్డుతో పాటు వారానికి రెండు సార్లు చికెన్, నెలలో రెండు సార్లు మటన్ అందిస్తారు.




జిల్లాలో 13 పాఠశాలలు

జిల్లాలో 13 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తీర్ణులై ఆసక్తి గలవారు సంబంధిత ధ్రువపత్రాలతో మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ప్రవేశాలను కేటాయిస్తారు. పది ఫలితాల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఓసీలకు 36 శాతం, బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. ఇందులో బాలికలకు 33 శాతం, దివ్యాంగులకు 03 శాతం ప్రత్యేకంగా ఉంటుంది. వీటి ప్రకారంగా ప్రవేశాలను కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోండి–నవీన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, ఇబ్రహీంపట్నంఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు చివరి గడువును ప్రభుత్వం ఈ నెల 31వరకు పొడిగించింది. ఆదర్శ పాఠశాలల్లో ఉచిత విద్య, దుస్తుల, వసతితో పాటు భోజన సదుపాయాన్ని కల్పిస్తు న్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం కుదింపు

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం భారీగా కుదించింది. మార్కెట్‌లో తాజా పరిస్థితులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పంట సాగు చేసిన సమయం, సాగు విస్తీర్ణం, పంట కోతకు వచ్చే ముందు వ్యవసాయ శాఖ నివేదిక ఆధారంగా పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. కానీ.. దిగుబడుల నాణ్యత, కేంద్రాలకు వస్తున్న ధాన్యం, మిల్లర్ల కొనుగోళ్లు, పొరుగు రాష్ట్రాల వ్యాపారుల ప్రభావం, అకాల వర్షాలతో పంట నష్టం వంటి కారణాలతో ఉమ్మడి జిల్లాలో సేకరణ మందగించింది. ఇది గమనించిన ప్రభుత్వం లక్ష్యం భారీగా తగ్గించింది.

136 కేంద్రాల ఏర్పాటు.. భద్రాద్రి జిల్లాలో 136 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఇది ఉమ్మడి ఖమ్మం లక్ష్యంలో భాగమే. ఈ నెల 25వ తేదీ నాటికి మొత్తం 3,135 మంది రైతుల నుంచి 21,908.600 మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేశారు. పలు మండలాల్లో పంట కోత ఆలస్యంగా జరుగుతుందని, మరో ఐదు వేలలోపు మె.ట. ధాన్యం నిల్వలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అకాల వర్షాలొస్తే ధాన్యం తడవకుండా భద్రపరిచేందుకు జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ, టేకులపల్లి, దమ్మపేట మండలాల్లో నాలుగు గోదాములు తాత్కాలికంగా అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహకులకు కలెక్టర్ అనుదీప్ సమాచారమిచ్చారు.యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం కుదింపుపై భద్రాద్రి జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌బాబును



'న్యూస్‌టుడే' సంప్రదించగా.. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోలు కేంద్రాల్లోని రాసుల ఆధారంగా తాజాగా ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం స్థాయిలో సేకరణ లక్ష్యం కుదించింది. ప్రస్తుతం మిల్లుల వద్ద దిగుమతుల్లో జాప్యం కాకుండా పర్యవేక్షిస్తున్నాం.

కారణాలివీ... ఏడాది యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అప్పటికే పంట కోత కోసిన వారు ధాన్యాన్ని సమీప కొనుగోలు కేంద్రాలు, పంట కల్లాల్లోనే రాసులుగా పోశారు. అనుకోకుండా అకాల వర్షాలు కురవడంతో రాసులు తడిశాయి. కొనుగోలు కేంద్రాల ప్రారంభం కూడా జాప్యమైంది. అటు వరుస వర్షాలు వీడలేదు. ఇటు పొడి వాతావరణం ఉన్నప్పుడల్లా రైతులు ఆగమేఘాల మీద కోతలు కోశారు. కొద్ది రోజుల్లోనే రాసులు పోటెత్తడంతో పాటు కొనుగోళ్లలో జాప్యం తలెత్తింది. ఫలితంగా ఏప్రిల్‌తో పాటు ఈ నెల ఇటీవల వరకు 'కల్లాల్లో కలవరం' వాతావరణమే కనిపించింది. ఓ వైపు బాధిత రైతులు తడిసిన రాసులు ఆరబెట్టుకుంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కోసం నిరీక్షిస్తుంటే..వారిని చూసి మిగతా వారు భయంతో దళారులకు అందినకాడికి తెగనమ్ముకున్నారు. కాంటాలు, మిల్లుల్లో దిగుమతిలో తీవ్ర జాప్యం వెరసి.. బయటి వ్యాపారులు పెట్టిన ధరకే ధాన్యం వదిలేశారు. ధాన్యం తడిసిందని, నాణ్యత లేదని, నూకల శాతం ఎక్కువ ఉందంటూ కొందరు మిల్లర్లు క్వింటాకు ఐదు నుంచి పది కిలోల వరకు కోత విధించడంతో ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. ఇవన్ని కష్టాలు పడలేక పంటను బయటి వ్యాపారులకు కట్టబెట్టడం రైతుల వంతైంది. పదిరోజులుగా ఠారెత్తిస్తున్న ఎండలతో మిల్లుల్లో పనిచేసే హమాలీలు బస్తాలు సరిగా దించలేకపోతున్నారు. పలు ప్రాంతాల్లో సీజన్ పనులకు వచ్చిన బిహార్, ఒడిశా రాష్ట్రాల హమాలీల్లో కొందరు వేసవి తాపం తాళలేక సొంతూళ్లకు వెళ్తున్నారు. ఆయా ప్రతికూలతల కారణంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో లక్ష్యం మేర ధాన్యం సేకరణ జరగలేదు.

# మెరుగైన సేవలే లక్ష్యం

వరంగల్ : ఆర్టీసీని ప్రజలకు మరింత దగ్గరకు చేసేందుకు సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్టీసీ డిపోలు పలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో బస్సు ప్రయాణ సమస్యలతో పాటు శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులు తీసుకోవాలంటే గ్రామీణులకు అవస్థలు తప్పడంలేదు. ఈ సమస్యను దూరం చేసి ఆర్టీసీ వైపు ప్రజలను ఆకర్షించేందుకు అన్ని గ్రామాల్లో బస్ అధికారులను నియమించాలని సంస్థ నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని తొమ్మిది డిపోల పరిధిలో 165 మందిని నియమించారు.

సేవలను వివరిస్తారు

గ్రామ బస్ అధికారులు ఆర్టీసీ ద్వారా అందించే సేవలను ప్రజలకు వివరిస్తారు. సురక్షిత ప్రయాణానికి బస్సులనే ఆశ్రయించాలని సూచిస్తారు. దివ్యాంగులు, విద్యార్థులకు రాయితీ పాస్‌లు ఇస్తున్న నేపథ్యంలో ఆర్టీసీని కాపాడుకోవాల్సిన అవసరం గురించి చెబుతారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి ఆర్టీసీ అధికారులకు చేరవేస్తారు. శుభ కార్యాలయాలకు అద్దె బస్సుల బుకింగ్‌కు గతంలో డిపో వరకు వెళ్లాల్సి వచ్చేది. ఇక మీదట విలేజ్ బస్ అధికారిని సంప్రదిస్తే సరిపోతుంది. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు మహిళా సంఘాల సభ్యులు, కల్యాణ మండపాల నిర్వాహకులకు తమ చరవాణి నంబరు అందించి ఆర్టీసీ కార్యక్రమాలను వారికి వివరిస్తారు.

ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారికి..

గ్రామాల్లో నివసించే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు ఇతర ఉద్యోగులను గ్రామ బస్ అధికారులుగా నియమించారు. ప్రజలతో మంచి సంబంధాలుండి స్వచ్ఛందంగా ముందుకొచ్చే వారికి నియామకంలో ప్రాధాన్యం ఇచ్చారు. పెద్ద గ్రామాలకు ఒకరు, రెండు, మూడు చిన్న గ్రామాలకు ఒకరు చొప్పున, ఒకరికి 5 గ్రామాలు మించకుండా నియమించారు. నగరాల్లో వార్డుల వారీగా బస్సు అధికారులను నియమించారు.

అర్హులను నియమించాం– శ్రీలత, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన వారిని గ్రామ బస్ అధికారులుగా నియమించాం. విధులపై పూర్తిస్థాయిలో వారికి సమాచారం ఇవ్వాలి. మరికొన్ని రోజుల్లో వీరు పూర్తి సేవలు అందిస్తారు. వారికి ఆర్టీసీ సంస్థ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్ అందిస్తాం. క్షేత్రస్థాయిలో ప్రయాణికుల అవసరాలు ఎప్పటికప్పుడు గుర్తించి సేవలందిస్తారు.

# ముక్కల రవాణాకు దిక్కేదీ?



ఖమ్మం : మొక్కజొన్న సాగు చేసిన రైతు పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందాన తయారైంది. మొదట్లో అకాల వర్షాలు, గాలిదుమారాలు ఆగమాగం చేశాయి. ఇంటిల్లిపాదీ నానా తిప్పలు పడి పంట నూర్పిడి చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే ఇక్కడా దయనీయ పరిస్థితే.. మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో మక్కలు కాంటా వేసి ఇరవై రోజులు అవుతున్నా నేటి వరకూ బస్తాలు రవాణా చేయడంలేదు. ఇది చాలదన్నట్లు లారీ డ్రైవర్లు దోపిడీ చేస్తున్నారు. దీంతో కాంటాలు వేసిన తమ మక్కల బస్తాల వద్ద రైతులు కంటికి కునుకులేకుండా కాపలా కాయాల్సి వస్తోంది. ఎప్పుడు వర్షం వస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. అయినా రవాణా విషయమై అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో యాసంగిలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ నెల 25వ తేదీ నాటికి 1.13 ల.మె.టన్నులు కొనుగోలు చేశారు. నెలాఖరున కొనుగోళ్లు పూర్తయ్యే నాటికి మరో 15 వేల మె.టన్నుల కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో పంట సాగు సమయంలో 3 ల.మె.టన్నులు సేకరించాలని నిర్ణయించినా, చివరకు లక్ష మెట్రిక్ టన్నులకు లక్ష్యం కుదించారు. కానీ 73 వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు.

'నాగులవంచ'కు 200 ట్రిప్పులు అవసరం

చింతకాని మండలం వ్యాప్తంగా చింతకాని, నాగులవంచ ఏపీసీఎస్‌ల ఆధ్వర్యంలో మూడు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మరో మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ కాంటాలు వేసిన పంట రవాణాకు 350 లారీల ట్రిప్పులు అవసరం ఉంది. ఒక్క నాగులవంచ సహకార సంఘానికే 200 లారీల ట్రిప్పులు అవసరమని మార్క్‌ఫెడ్‌కు పీఏసీఎస్ అధికారులు ఇండెంట్ పంపారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఘం పరిధిలో ఆదివారం వరకూ 22 వేల క్వింటాళ్లు కాంటాలు వేసి రవాణాకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ఒక్క పాతర్లపాడులోనే 18వేల బస్తాలు కాంటాలు వేసి ఉండటం గమనార్హం. వాటిని లారీలో లోడ్ చేసేంత వరకూ రైతులదే బాధ్యత అని మార్క్‌ఫెడ్ అధికారులు తేల్చి చెప్పటంతో రైతులు పట్టాలు వెంటబెట్టుకుని రాత్రింబవళ్లూ కల్లాల వద్ద కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం కుదింపు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం భారీగా కుదించింది. మార్కెట్‌లో తాజా పరిస్థితులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పంట సాగు చేసిన సమయం, సాగు విస్తీర్ణం, పంట కోతకు వచ్చే ముందు వ్యవసాయ శాఖ నివేదిక ఆధారంగా పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. పంట కోత మొదలైన తర్వాత దిగుబడుల నాణ్యత, కేంద్రాలకు వస్తున్న ధాన్యం, మిల్లర్ల కొనుగోళ్లు, పొరుగు రాష్ట్రాల వ్యాపారుల ప్రభావం, అకాల వర్షాలతో పంట నష్టం వంటి కారణాలతో సేకరణ మందగించింది. ఇది గమనించిన ప్రభుత్వం లక్ష్యం తగ్గించింది. యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం కుదింపుపై ఖమ్మం జిల్లా పౌరసరఫరాల సంస్థ సహాయ మేనేజర్ నర్సింహారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. తాజాగా రైతుల వద్ద ధాన్యం నిల్వలపై అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా సేకరణ లక్ష్యం అంచనాలు మారుతుంటాయని ఆయన వివరించారు.

బస్తాకు రూ.8 ఇస్తేనే రవాణా

రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొన్న కొందరు డ్రైవర్లు, లారీల యజమానులు బస్తాకు రూ.8లు ఇస్తే వెంటనే లారీలు తెస్తామని మెలికపెడుతున్నారు. వర్షాలు వస్తే బస్తాలు తడుస్తాయన్న భయంతో నేరడ, నాగిలిగొండకు చెందిన రైతులు ఒక్కో బస్తా(50 కిలోలు)కు రూ.8లు అదనంగా చెల్లిస్తున్నారు. దీంతో రైతుపై అదనపు భారం పడుతోంది.

లారీలు పంపిస్తాం: సునీత, మార్క్‌ఫెడ్ డీఎం

'నాగులవంచ సహకార సంఘం పరిధిలో లారీల కొరతతో సమస్య ఏర్పడింది. లారీలు పంపిస్తాం. రైతులకు ఇబ్బం దులు కలగనీయం. మొక్కజొన్న రవాణాకు సంబంధించి లారీ డ్రైవర్లకు బస్తాకు రూ.8లు ఇచ్చి రైతులే అలవాటు చేశారు.'

# పొదుపు మంత్రం.. పర్యావరణ హితం

ఖమ్మం : ఇంధనం పొదుపు చేయండి.. అనే నినాదాన్ని తరచూ వింటుంటాం.. ఇంధనమే కాదు.. నీరు, ఆహారం, ప్లాస్టిక్, సాధారణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఆరోగ్యం వంటి ఏడు ప్రధాన అంశాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' అంటూ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్‌రెడ్కో) ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విద్యుత్తు, చమురు, గ్యాస్ వంటి వాటిని ఇంధనంగా గుర్తిస్తాం. వీటిని పొదుపు చేయడం ద్వారా తరిగిపోతున్న వనరులను సంరక్షించుకోవచ్చు. పర్యావరణానికీ మేలు కలుగుతుంది. మనముందున్న పొదుపు మార్గాలేమిటో చూద్దాం.

1. విద్యుత్తు

పైసా నిర్వహణ ఖర్చు లేకుండా ఉత్పత్తయ్యే సౌరవిద్యుత్తు వినియోగం పెంచుకోవాలి. దీనిపై రెడ్కో సంస్థ ఏటా రాయితీ పథకాలు అమలు చేస్తోంది.

2. ఇంధనంపెట్రోలు వినియోగాన్ని తగ్గించేందుకు ట్రాఫిక్ సిగ్నళ్లు, రైల్వే క్రాసింగుల వద్ద వాహనాల ఇంజిన్లు ఆఫ్ చేయాలి. వీలైతే దూరాన్ని బట్టి సైకిల్ వాడకాన్ని ప్రారంభించాలి. సీఎన్‌జీ/ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలి.

3. గ్యాస్‌పశువుల వ్యర్థాలతో ఉత్పత్తి చేసే బయోగ్యాస్‌ను ఉపయోగించాలి. సిలిండర్ వాడకాన్ని తగ్గించేందుకు అందుబాటులో ఉన్న ఉత్తమమైన మార్గమిది. ఇప్పటికే ప్రభుత్వం పలు జిల్లాలో ప్రయోగాత్మకంగా బయోగ్యాస్ (గోబర్ధన్) ప్లాంట్లు నిర్మిస్తుండగా.. భద్రాద్రి జిల్లాలోని పెనగడప ఇందుకు ఎంపికైంది.


4.రవాణా అవకాశముంటే ప్రజారవాణాకు ప్రాధాన్యమివ్వాలి. రైళ్లు, బస్సులు, లోకల్ సర్వీసులున్న చోట వ్యక్తిగత వాహనాల ప్రాధాన్యం తగ్గించాలి.

5. జల సంరక్షణ

వచ్చేది వర్షాకాలం సీజన్. సాధ్యమైనంత వరకు వర్షపు నీరు సద్వినియోగం చేసుకోవాలి. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే అంతా.. చెట్లు నాటాల్సిందే.

6. ఈ–వేస్ట్

నిరుపయోగంగా మారిన సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల కారణంగా నివాసాల్లో ఈ–వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వీటిని రీసైక్లింగ్ చేయాలి. ఉభయ జిల్లాల్లోని పట్టణాల్లో పురపాలక శాఖ ఆదేశాలతో జూన్ 5 వరకు నిర్వహిస్తున్న



'ట్రిబుల్ ఆర్' కేంద్రాకు వీటిని అందించవచ్చు.

7. ఆహారం

విలువైన ఆహారాన్ని చాలామంది వృథా చేస్తుంటారు. దీన్ని తగ్గించాలి. ఆరోగ్యం కోసం పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాలని వైద్యనిపుణులు చెబుతున్నారు.

8. ప్లాస్టిక్‌తడి, పొడి చెత్తను స్వచ్ఛ ఆటోలకు వేర్వేరుగా అందించి వ్యర్థాల నిర్వహణకు సహకరించాలి. పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగజేస్తున్న 'ఒకసారి వినియోగించే ప్లాస్టిక్' కవర్లు, బాటిళ్ల వాడకాన్ని తగ్గించాలి. వస్త్ర, నార సంచుల వినియోగం పర్యావరణానికి, జంతుజాలానికి శ్రేయస్కరం.

పైలట్ ప్రాజెక్టుగా మూడు మండలాలు ఎంపిక 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమానికి రెడ్కో సంస్థ భద్రాద్రి జిల్లా సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఆయా మండలాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇంధన పొదుపు సహా ఏడు ముఖ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఖమ్మం నగరంలోని ప్రధాన నివాస కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాల్లో సైతం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు, ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు సైతం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ప్రజా చైతన్యానికి కృషి– ఉమాకాంత్, మేనేజర్, టీఎస్ రెడ్కో

ప్రజారోగ్యం, పొదుపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరచటమే మా లక్ష్యం. పలు అంశాలతో అవగాహన కల్పిస్తాం. భావి పౌరులను చైతన్యపరిచేందుకు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాం.

# హరితంపై ఎండ దెబ్బ

జగిత్యాల : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో హరితనగరంలో భాగంగా ఎక్కడ స్థలం దొరికితే అక్కడ మొక్కలు నాటారు. వాటి సంరక్షణలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. విభాగినుల మధ్య మాత్రం ప్రైవేటు ఏజెన్సీ చూసుకుంటుండగా, కూడళ్ల మధ్య, అంతర్గత వీధులు, రోడ్లకు ఇరువైపులా నాటిన వాటికి మాత్రం బల్దియానే పర్యవేక్షిస్తోంది. ఇంకేముంది ప్రతి రోజు మొక్కలను పరిశీలించాల్సి ఉండగా వదిలేశారు.వాడిపోతున్న మొక్కలునగరంలోని ప్రధాన రహదారులతోపాటు డివిజన్లలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటిన మొక్కలకు ఎండదెబ్బ తగిలి వాడిపోతున్నాయి. భానుడి ప్రతాపంతో ఎండిపోతుండగా కనీసం దృష్టి సారించడం లేదు. ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టాల్సి ఉంటుంది. ట్యాంకర్లు రాకపోవడం, వచ్చినా మండుటెండల్లో నీరు పోస్తున్నారు. డివైడర్ల మధ్య రోజు విడిచి రోజు పోస్తుండగా డివిజన్లలో రెండు, మూడు రోజులకు ఒకసారి పోస్తుండటంతో కొన్ని మొక్కలు చనిపోయే దశకు చేరాయి.

# శిఖం భూములపై ఉదాసీనత

వరంగల్ : గ్రేటర్ వరంగల్ పరిధిలో చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమణలకు తెగబడుతున్నారు. వరంగల్– హనుమకొండ నగర నడిబొడ్డున భద్రకాళి చెరువును ఆక్రమిస్తుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డులో వందల కొద్దీ టిప్పర్లతో మట్టిని తరలిస్తూ.. చెరువు నింపుతున్నారు. ఆరేడు నెలలుగా భద్రకాళి చెరువు శిఖం భూములు గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రి చదును చేస్తున్నారు. అడిగితే ప్రైవేటు పట్టా భూములని చెబుతున్నారు. పది రోజుల క్రితం భద్రకాళి చెరువు కట్టను తెంచేసి మురుగు మళ్లించారు. నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని, ప్రైవేటు వ్యక్తులు చెరువులో మట్టి నింపుతున్నారని సామాజిక కార్యకర్తలు ఫిర్యాదు చేసినా.. అధికారులు కదలడం లేదనే విమర్శలున్నాయి.

స్పందించని అధికారులు

హనుమకొండ ప్రాంతంలో కాకతీయ సమాధుల స్థలాల అన్యాక్రాంతంపై సామాజిక కార్యకర్త రాజు ఫిర్యాదు చేశారు. హనుమకొండ మండలం సర్వేనంబరు 910లో 8.03 ఎకరాలు, సిద్దేశ్వర గుండం సర్వేనంబరు 911లో 1.30 ఎకరాలు ప్రభుత్వ భూములే అని అప్పటి హనుమకొండ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్డీవో వాసుచంద్ర 20-12-2021 నాడు రాత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ భూములేనని అధికారులు సమాధానం ఇచ్చి ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదని సామాజిక కార్యకర్తలు, స్థానికులంటున్నారు. లెప్రసీ కాలనీ నుంచి ప్రైవేటు నర్సింగ్ కళాశాల వరకు భద్రకాళి చెరువు శిఖం భూములు చేజారే పరిస్థితులు



నెలకొన్నాయని చెబుతున్నారు.

హద్దులు తేల్చకపోవడంతో..హనుమకొండ పద్మాక్షిగుట్ట, న్యూశాయంపేట రోడ్డు, భద్రకాళి ఫోర్ షోర్ బండ్ దిగువన ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములకు హద్దులు లేవు. ఎవరిష్టం వారిదే అన్నట్లుగా ప్రైవేటు వ్యక్తులు హద్దులు ఖరారు చేసి, ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. ఇప్పటికే భద్రకాళి చెరువు, పద్మాక్షమ్మ, సిద్దేశ్వరస్వామి, వీరపిచ్చమాంబ, హనుమకొండ గుట్ట స్థలాల అన్యాక్రాంతంపై లోకాయుక్త న్యాయస్థానం సీరియస్‌గా ఉంది. వచ్చే జూన్ నెలాఖరు నాటికి సమగ్ర సర్వే చేసి నివేదిక ఇవ్వాలని న్యాయమూర్తి జిల్లా దేవాదా య శాఖాధికారులు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇంతవరకు అడుగు పడటం లేదు. సర్వే చేస్తే వాస్తవాలు బయట పడే అవకాశాలు న్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# జిల్లాలో గంజాయి మాఫియా!!

మహబూబాబాద్ : నిషేధిత గంజాయి, గుడుంబా బెల్లం మానుకోటకు భారీగా చేరుకుంటోంది. నిఘా పెట్టి కట్టడి చేస్తున్న యంత్రాగానికి స్మగ్లర్లు సవాల్ విసురుతున్నారు. పోలీసులు పట్టుకుంటున్నది కొద్దిగా ఉంటున్నా.. పెద్ద మొత్తంలో చేరాల్సిన చోటికి చేరుతున్నట్లు సమాచారం. పట్టణాల్లో, మండల కేంద్రాల్లోనూ యువతే లక్ష్యంగా విక్రయాలు కూడా చేపడతున్నట్లు వినికిడి. ఈ నెల 11న మహబూబాబాద్, నెల్లికుదురు మండలాలకు చెందిన ముగ్గురు యువకులు వ్యవసాయ పొలం వద్ద భద్రపరిచిన 150 కిలోల గంజాయిని హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా నెల్లికుదురు పోలీసులు పట్టుకున్నారు. తాజాగా తొర్రూరులో ద్విచక్ర వాహనంపై రెండు కిలోల గంజాయిని తరలిస్తున్న యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇక్కడే కాకుండా వివిధ జిల్లాల పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ గంజాయి స్మగ్లర్లు పట్టుబడితే అందులోనూ జిల్లాకు చెందిన వారే ఉంటుండడం గమనార్హం. కాగా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి భారీగా దిగుమతి చేసుకొని అమ్మకాలు చేయడంతో పాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. అడ్డుకట్టు వేయడానికి పోలీసులకు ఒక పరీక్షగా మారింది.

సిగరెట్లు విక్రయం

మత్తు కలిగించే ఈ గంజాయిని మహబూబాబాద్, తొర్రూరు, కురవి, డోర్నకల్, మరిపెడ, నర్సింహులపేట ప్రాంతాల్లో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ రూపకంగానే కాకుండా మహబూబాబాద్ పట్టణంలో సిగరెట్లలోనూ గంజాయిని పెట్టి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. రూ.250కి ఒక్కటి చొప్పున..తొర్రూరు పట్టణ ప్రాంతంలోనూ రూ.50 నుంచి రూ. 150 చొప్పున ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు వినికిడి. ఈ దందా అంతా శివారు ప్రాంతాల్లోనే కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. సుమారు నెల రోజుల కిందట మానుకోటలో ఓ యువకుడు గంజాయి సిగిరెట్ తాగి తాను ఉంటున్న కాలనీల్లో హంగామా సృష్టించడంతో ఆ ప్రాంతవాసులు డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ విషయంలో బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచారు.

ఎక్కడి నుంచి వస్తుందంటే

జిల్లాకు చెందిన గంజాయి రవాణాదారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతూరు, సీలేరుతో పాటు రాష్ట్ర సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అధిక మొత్తంలో తెచ్చి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు కార్లు, ఆటో, ట్రాక్టర్ల ద్వారా తెచ్చిన వారు ప్రస్తుతం ద్విచక్ర వాహనాల ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా జిల్లాలోకి చేర్చుతున్నట్లు తెలిసింది. మరిపెడ ప్రాంతం నుంచి ఎక్కువగా సరఫరా అవుతున్నట్లు సమాచారం. ఆ సరకును పొలాలు, అటవీ ప్రాంతాలున్న చోట్ల భద్రపరిచి ఫోన్ల ద్వారా ఆర్డర్లు తీసుకొని రాష్ట్ర రాజధాని ప్రాంతానికి రవాణా చేస్తున్నట్లు తెలిసింది.

అనర్థాలపై అవగాహన కల్పిస్తూ..గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న పట్టుబడుతున్న వారిలో ఎక్కువ శాతం యువతనే ఉంటుంది. పోలీసులు పాత నేరగాళ్లను గుర్తించి మరోసారి గంజాయి క్రయవిక్రయాలు చేయకూదంటూ..వాటి కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. అయినా వారిలో మార్పు రాకపోగా వ్యాపారానికి తమ పంథాను మార్చుకున్నట్లు తెలిసింది.

ప్రత్యేక నిఘా పెట్టాంరమణబాబు, డీఎస్పీ, మహబూబాబాద్

గంజాయి రవాణాపై నిఘా తీవ్రం చేశాం. రవాణాదారులపై చర్యలు తీసుకుంటున్నాం. అమ్మినా..నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. యువతను మత్తు నుంచి దూరం చేసేందుకు గ్రామాల్లో కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

# సామాజిక ఆరోగ్యకేంద్రం ఉన్నతీకరణకు మోక్షమెప్పుడో?

జనగామ : పాలకుర్తిలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరణ కలగానే మిగిలింది. దీంతో మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. ఏడాది కిత్రం ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వచ్చినా.. వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి.

రోగుల ఇబ్బందులుఈ ఆసుపత్రి 1977లో 30 పడకల ఆసుపత్రిగా మారింది. ఆ తర్వాత ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా స్థాయిని పెంచారు. అనంతరం సామాజిక వైద్యశాలగా కొనసాగుతోంది. దీని ప్రాంగణంలో మూడేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షలతో పోస్టుమార్టం గదిని నిర్మించారు. దాన్ని ఇంతవరకూ ప్రారంభించలేదు. ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చి మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రికి నిత్యం చికిత్స కోసం సుమారు 120 మంది వరకు బయటి రోగులు వస్తుంటారు. రోజు సుమారు 200 మంది వస్తారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది, మందులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రజలు వరంగల్, హైదరాబాద్, జనగామ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. వైద్యానికి రూ.లక్షలు వెచ్చిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. వైద్యశాలను 100 పడకలుగా మార్చి 24 గంటలు వైద్య సేవలందించాల్సిన అవసరం ఉంది.

అందని ద్రాక్షగానే అత్యవసర వైద్యం..

ఆసుపత్రిలో రోగులకు అత్యవసర వైద్యం అందని ద్రాక్షగానే మారింది.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందడం లేదు.ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచిస్తుంటారు. మిగతా రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందవు. వైద్యశాలలో 8 మంది వైద్యులుండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారు. కొన్నేళ్లుగా వైద్యుల పోస్టులను భర్తీ చేయడం లేదు. వైద్యులు స్థానికంగా ఉండకపోవడంతో రాత్రివేళల్లో వైద్య సేవలందడం లేదు. జనరల్ సర్జన్, ఫిజీషియన్, అనస్తీషియా, పిల్లల వైద్యనిపుణులు, గైనకాలజిస్టులను నియమించి మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి– రమాదేవి, పాలకుర్తి

30 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేయాలి. ఆధునిక పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి. పాలకుర్తి దినదినాభివృద్ధి చెందుతున్నందున ఇక్కడ పెద్దాసుపత్రి ఉండాల్సిందే. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

ప్రతిపాదనలు పంపించాం..– వైద్యాధికారి పాలకుర్తి ఆసుపత్రిని 100 పడకల వైద్యశాల ఆసుపత్రిగా మార్చాలని ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆసుపత్రిలో వైద్యుల కొరతపై ప్రభుత్వం యోచిస్తోంది. త్వరలో సిబ్బంది ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తారని ఆశిస్తున్నా. ఆసుపత్రిలో నూతన బీపీ పరికరంతో పాటు గర్భిణులకు స్కానింగ్ యంత్రాన్ని అందుబా టులోకి తెచ్చాం. రక్తపరీక్షల యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

# ఉపాధిలో భేష్

భూపాలపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత లక్ష్యానికంటే అధికంగా పనులు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా 5వ స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రజలకు పనులు కల్పించడమే కాకుండా అన్నదాతలకు, గ్రామాల అభివృద్ధికి పలు పనులు చేపట్టడంలో ఉపాధి హామీ పథకం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. సొంత గ్రామంలోనే పనులు చేసుకుంటూ ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటుండంతో పనులను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు.

వంద శాతం మించి..

జిల్లాలోని 241 పంచాయతీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు 27.38 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేసుకున్నారు. 2023 మార్చి 31వ తేదీ నాటికి లక్ష్యం కంటే అధికంగా 30.28 లక్షల పని దినాలు(118 శాతం) పనులు పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 5వ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పనుల నిర్వహణకు సంబంధించి వెంటవెంటనే పనులకు అనుమతులివ్వడంతో లక్ష్యం పూర్తి చేయడం తేలికైందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి లక్ష్యానికి మించి కూలీలకు పనులు కల్పించడం ఇదే మొదటిసారని అధికారులు తెలుపుతున్నారు. పనులకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది మూడు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సకాలంలో ఇది జరిగేలా, వెనుకబడి మండలాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి లక్ష్యం పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నారు.

కూలీ చెల్లింపుల్లో 6వ స్థానం

కూలీలకు నగదు చెల్లింపుల్లోనూ జిల్లా ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు కూలీ సగటున రూ.150 నుంచి రూ. 164.4 వరకు అందిస్తే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఒకరోజు కూలీ సగటున రూ.186.50 చెల్లించారు. అలాగే ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.56.50 కోట్లు చెల్లింపు చేశారు. ఇంకా సుమారు రూ.2 కోట్ల చెల్లింపులు చేపట్టాల్సి ఉందని.. రెండు మూడు రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.08 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 2.39 లక్షల మంది కూలీలుగా నమోదు చేసుకున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.17 లక్షల మంది ఉపాధి పనులను సద్వినియోగం చేసుకున్నారు. 773 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అత్యధికంగా భూపాలపల్లి, కాటారం, మహదేవ్‌పూర్, రేగొండ మండలాల్లో వందరోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు ఉండగా అత్యల్పంగా టేకుమట్ల, మల్హర్‌రావు, పలిమెల మండలాల్లో ఉన్నారు.

# 'ఆరోగ్య మహిళ'కు ఆదరణ



వరంగల్ : స్త్రీల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభించిన 'ఆరోగ్య మహిళ' సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా 100 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి 8 రకాల వైద్యసేవలను మహిళలకు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో గత నాలుగు వారాలలో 697 మంది మహిళలు ఆరోగ్య మహిళ సేవలు పొందగా, 52 మందిని మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం, సీకేఎం, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ జీఎంహెచ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. హనుమకొండకు చెందిన ఓ 18 సంవత్సరాల విద్యార్థినికి ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద ఎంజీఎం వైద్యులు కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా సాధ్యం కాని శస్త్రచికిత్సను నిర్వహించి బతికించారు.

గుర్తించిన సమస్యలు

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ సంతానలేమి థైరాయిడ్ మధుమేహం రక్తపోటు రక్తహీనత మోనోపాజ్ బరువు

8 రకాల పరీక్షలు

1. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు
2. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్
3. థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డీ పరీక్షలు
4. మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్ష
5. మోనోపాజ్ దశకు సంబంధించిన పరీక్షలు హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ, కౌన్సెలింగ్
6. నెలసరి, సంతాన సమస్యలపై పరీక్షలు అవగాహన అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు
7. శారీరక కలయిక సంబంధిత అంటు వ్యాధుల పరీక్షలు, వైద్యం
8. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన

కార్పొరేట్ ఆసుపత్రుల్లో కానిది ఎంజీఎంలో చేశారు

– సన్నూరి పూజిత, దీన్‌దయాళ్‌నగర్, హనుమకొండ

మాది హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీన్‌దయాళ్‌నగర్. అమ్మానాన్నలు కూలి పని చేస్తారు. నేను సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. పుట్టుకతో తల మెదడు భాగంలో ఏర్పడిన చిన్నగడ్డ నేను పెరిగేకొద్దీ పెద్దదైంది. నాన యాకయ్య అన్ని ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి చూపించారు. శస్త్రచికిత్స చేస్తే మీ బిడ్డ బతకదని చెప్పడంతో తాత్కాలిక మందులతో కాలం గడుపుతునన్నా. మార్చి 8న మహిళా దినోత్సవం వేళ న్యూశాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభంలో పెద్ద డాక్టర్లు వస్తున్నారని నాన్న నన్ను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను కలిసి తమ బాధ చెప్పుకున్నాం. ఆయన స్పందించి ఎలాగైనా నయం చేయాలని వైద్యులకు సూచించి ఎంజీఎంకు పంపించారు. మార్చి 15న వైద్యులు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. మందులిచ్చి శనివారం డిశ్చార్జి చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ఎంజీఎం వైద్యులు శస్త్రచికిత్స చేయడం నాకు ఆనందంగా ఉంది. ఎంజీఎం వైద్యులకు, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు రుణపడి ఉంటాను.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

– డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, వరంగల్

'ఆరోగ్య మహిళ' పథకంలో వైద్యసేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఆయా కేంద్రాలలో గుర్తించిన వారికి అవసరమైతే మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. జీవితాంతం సంతోషంగా జీవించేందుకు మహిళలు తప్పనసరిగా ఆరోగ్య మహిళ సేవలను పొందాలి.

# చిరు వ్యాపారుల చిరునామా ఎక్కడ



వరంగల్ : చిరు వ్యాపారులకు శాశ్వత చిరునామా చూపించడంలో నగర పురపాలక సంస్థలు వెనకబడ్డాయి. వీధి వ్యాపారుల విక్రయ కేంద్రాలు(హాకర్స్ జోన్లు) ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నగరంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో సుమారు ఐదు వేల మంది వీధి వ్యాపారులుంటారు. ప్రధాన, అంతర్గత రహదారులు, కూడళ్లు, రైల్వే, బస్ స్టేషన్ల వద్ద బిక్కు బిక్కుమంటూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. నిత్యం ట్రాఫిక్ పోలీసులు, గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరానికి ఎవరైనా వీఐపీలు వస్తే దుకాణాలు మూసేయిస్తున్నారు. శాశ్వత చిరునామా లేక పరేషానవుతున్నారు. నగరంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా శాశ్వత పరిష్కారం చూపాలని పలుమార్లు వీధి వ్యాపారుల ప్రతినిధులు విన్నవించినా అధికారుల్లో చలనం లేదు.

ఐదు వేల మంది ఉన్నా.. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో సుమారు ఐదు వేల మంది చిరు వ్యాపారులుంటారు. వీరికి శాశ్వత చిరునామా చూపించేందుకు గ్రేటర్ వరంగల్ దృష్టి సారించింది. టౌన్‌ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయిలో సర్వే చేసింది. 61 ప్రాంతాలు గుర్తించారు. 31 ప్రాంతాల్లో గ్రీన్ జోన్(వీధి విక్రయ కేంద్రాలు), 14 అంబర్ జోన్లు(సమయానికి అనుగుణంగా వ్యాపారాలు), 14 రెడ్ జోన్లు(వీధి వ్యాపారాల నిషేధం) ఎంపిక చేశారు. 17 ప్రాంతాల్లో చిరు వ్యాపారుల కోసం హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉండగా 11 పూర్తి చేశారు. కేవలం 517 మందికి దుకాణాలు కేటాయించారు. కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో 11 వీధి విక్రయ కేంద్రాలు ప్రారంభించారు. 517 మంది చిరు వ్యాపారులకు షెడ్లు కేటాయించారు. కాజీపేట బాపూజీనగర్‌లో కూరగాయలు, పండ్లు విక్రయ కేంద్రాల్లో వ్యాపారులున్నారు. లి హనుమకొండ కుమార్‌పల్లి కూరగాయల మార్కెటు, మాంసం మార్కెట్లో వినియోగంలో ఉన్నాయి. సుబేదారి పోలీసు స్టేషన్ పక్కనే వినియోగంలో ఉంది. టీటీడీ కల్యాణ మండపం నుంచి జిల్లా గ్రంథాలయం వరకు, ఎల్బీ ప్రాక్టీసింగ్ హైస్కూల్ నుంచి డైట్ కళాశాల వరకు, ఎస్ఈ ఇరిగేషన్ కార్యాలయం నుంచి ఐబీ ప్రహరీ వరకు, బీఈడీ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వెనకాల షెడ్లు చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. హనుమకొండ చౌరస్తా, విజయటాకీస్ రోడ్, టైలర్‌స్ట్రీటు, ఏనుగులగడ్డ, కొత్త బస్టాండ్, అలంకార్, అదాలత్, నయీంనగర్, కేయూసీ జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ, బాలసముద్రం ఏకశిలా పార్కు తదితర ప్రాంతాల్లో రహదారుల్లోనే చిరు వ్యాపారాలు నడుస్తున్నాయి. వరంగల్ ప్రాంతంలో సుమారు 2-3 వేల మంది చిరు వ్యాపారులుంటారు. ఇంతవరకు ఒక్క వీధి విక్రయ కేంద్రం ఏర్పాటు కాలేదు. ఐదారేళ్ల క్రితం వరంగల్ అండర్ బ్రిడ్జి పక్కనే రైల్వే ట్రాక్ పక్కన షెడ్లు కడుతుంటే అభ్యంతరాలు వచ్చాయి. వరంగల్ స్టేషన్ పార్కు, పోచమ్మ మైదాన్, ఎంజీఎం ఆసుపత్రి, రాంకీ వద్ద స్థలాలు ఎంపిక చేశారు. ఇంతవరకు అడుగులు పడలేదు. లి గోపాలస్వామి గుడి, పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ, వరంగల్ రైల్వే, బస్ స్టేషన్లు, వరంగల్ ప్రధాన తంతి తపాలా కేంద్రం, అండర్‌బ్రిడ్జి, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్, పాత చౌరస్తా, బట్టల బజారు, పాపయ్యపేట చమన్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పైనే చిరు వ్యాపారాలు సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

స్థలాల కోసం సర్వే: రమేష్, టీఎంసీ, మెప్మా

కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో వీధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాల ఎంపిక సర్వే నడుస్తోంది. ఇప్పటి వరకు 11 ప్రాంతాల్లో పూర్తయ్యాయి. 517 మందికి దుకాణాలు కేటాయించాం. వరంగల్‌లో స్థలాలు లభిస్తే వెంటనే పనులు మొదలవుతాయి.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు నర్సంపేట : వీధి వ్యాపారుల కోసం నర్సంపేట పురపాలిక అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి 2021 ఫిబ్రవరిలో అంగడి మైదానంలో వ్యాపార మడిగలు నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెప్మా సిబ్బంది గుర్తించిన వీధి వ్యాపారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కూరగాయలు, పండ్లు, పూలు, కుండలు, ప్లంబర్, జనరల్ సామాను, చిల్లర కొట్టు, ప్లాస్టిక్ సామాను వంటి వివిధ వ్యాపారాలు చేసే వీరు దుకాణాలు నిర్వహణకు సొంత అడ్డాల్లేక నానా కష్టాలు పడుతున్నారు.వీరికి చేయూతనిచ్చేందుకు నర్సంపేటలో పట్టణ ప్రగతి పథకంలో రూ.7 లక్షలతో 15 షెడ్లు నిర్మించారు. పుర అధికారులు కూరగాయల మార్కెట్(రైతు బజారు)స్థలంలో పక్కాగా నిర్మించారు. 2021 ఫిబవరిలో షెడ్లను ప్రారంభిస్తామని చెప్పిన అధికారులు అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయారు. ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మల్లా వెక్కిరిస్తున్నాయి. ఈ షెడ్లలోకి వచ్చేందుకు వీధి వ్యాపారులు సుముఖత చూపడం లేదు. ఇక్కడ దుకాణాలు పెడితే బేరాలు సాగవని చెప్పి ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కట్టించిన షెడ్లు వీధి వ్యాపారులకు ఉపయోగపడక పోగా ..నిర్మాణంతో పుర ఖజానాకు చిల్లి పడింది.నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణం వర్ధన్నపేట : వర్ధన్నపేటలో చిరు వ్యాపారులకు ఉపయోగపడేలా నిర్మించ దలిచిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన సముదాయ పనులు రెండు సంవత్సరాలుగా పునాదులకే పరిమితమయ్యాయి. పనులునత్తనడకన సాగుతుండడంపై ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్వయంగా గుత్తేదారునిపై, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా వేగంగా జరగడం లేదు. సుమారు వంద మంది వరకు చిరు వ్యాపారులు ఉండగా జాతీయ రహదారి పక్కన అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

# వినియోగం లేనట్లేనా?

భూపాలపల్లి : ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మించినా వినియోగించుకోవడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఎండలకు, వానలకు తట్టుకొనేలా పట్టణ ప్రగతి నిధులు రూ.14.59 లక్షలతో సుభాష్‌కాలనీ సమీపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన 28 రేకుల షెడ్లు నిర్మించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ ఏడాది ఫిబ్రవరి 23న ప్రారంభించారు. ఒక రోజు ముందుగానే వీధి వ్యాపారులకు డ్రా పద్ధతిన కేటాయించారు. మంత్రి ప్రారంభించిన కొద్దిసేపు మాత్రమే వీధి వ్యాపారులు ఆ షెడ్లలో అమ్మకాలు సాగించారు. మళ్లీ పాత ప్రాంతాల్లో రోడ్ల పక్కనే అమ్మకాలు చేపడుతున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలి..

వీధి వ్యాపారుల కోసం ప్రభుత్వం నిర్మించే రేకుల షెడ్లను రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్మించిన షెడ్లు అంబేడ్కర్ కూడలి ప్రాంతం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల



పక్కన సుమారు 600 మీటర్ల దూరంలో ఉండటంతో అందులో అమ్మకాలు కొనసాగవని ముందుకు రావడం లేదు. అంబేడ్కర్ కూడలి ప్రాంతంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయం ముందు భాగంలో, గణేష్ చౌక్ ప్రాంతంలో అటవీ శాఖ కాంప్లెక్స్ ముందు, సింగరేణి ఏరియా వర్క్ షాపు ముందు భాగంలో రేకుల షెడ్లు నిర్మిస్తే వీధి వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని పలువురు వ్యాపారులు తెలిపారు.

తప్పని ట్రాఫిక్ సమస్య

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి, గణేష్ చౌక్, సింగరేణి వర్క్ షాపు ఏరియా ప్రాంతాల్లో రోడ్ల పక్కన తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు, పూల అమ్మకాలు కొనసాగుతున్నాయి. రోడ్ల పైనే అమ్మకాలు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పలు సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అంబేడ్కర్ కూడలి ప్రాంతంలో కొద్ది నెలల క్రితం లారీ ఢీకొని కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు, పాలకులు ట్రాఫిక్ సమస్యను సరిదిద్దడానికి తాత్కాలికంగా నిర్ణయాలు తీసుకుని, ఆ తర్వాత వదిలేస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలి– లలిత, చిరు వ్యాపారి

ప్రభుత్వం నిర్మించిన రేకుల షెడ్లు దూరంగా ఉండటంతో అందులో అమ్మకాలు కొనసాగవనే నమ్మకంతో చిరు వ్యాపారులు అందులోకి వెళ్లడం లేదు. అమ్మకాలు జరిగే ప్రాంతంలోనే షెడ్లు నిర్మించాలి. వారు ఎక్కడ ఖాళీ స్థలం అనుకూలంగా ఉంటే అక్కడ నిర్మించారు. అందులోకి వెళ్తే అమ్మకాలు ఉండవు. షెడ్లలో మాంసం, చికెన్ సెంటర్లకు కేటాయిస్తే బాగుంటుంది.

చిరు వ్యాపారులకు నష్టం చేయవద్దు– అంబాల చంద్రమౌళి, కాకతీయ ఫ్రూట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జనాల రద్దీ, ప్రయాణికులు ఎక్కువగా బస్సుల కోసం వేచి చూసే ప్రదేశాల్లోనే పండ్లు, పూలు తదితర చిరు వ్యాపారాలు ఎక్కువగా కొనసాగుతాయి. పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు నిర్మించిన 28 రేకుల షెడ్లు జనాలు ఎక్కువగా సంచరించని ప్రాంతంలో ఉండటంతో అందులోకి వెళ్లడానికి చిరు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంతాల్లోనే అమ్మకాలు చేపట్టేందుకు వారికి అనుమతులివ్వాలి.త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం– రాజేశ్వరి, మెప్మా పీడీ15 రోజుల క్రితం డ్రా పద్ధతిన రేకుల షెడ్లు కేటాయించిన చిరు వ్యాపారులతో త్వరలోనే మున్సిపల్ కమిషనర్, ఛైర్ పర్సన్ సమక్షంలో సమావేశాన్ని నిర్వహిస్తాం. వారికి మరి కొద్ది రోజుల సమయాన్ని కేటాయించి, డిమాండ్లను పరిగణలోకి తీసుకుని, జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు వారికి కేటాయించిన షెడ్లలోకి పంపించడానికి చర్యలు తీసుకుంటాం.

# నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి!

కరీంనగర్ : అంబేడ్కర్ స్టేడియం ఎదురుగా రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న వారికి బస్టాండ్ వెనుకాల ఉన్న షెడ్డులో కేటాయించారు. కొన్ని రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఇక్కడే విక్రయించారు. కొనుగోలుదారులు రాకపోవడంతో చిరు వ్యాపారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.రెండేళ్ల కిందట కరోనా రావడం.. లాక్‌డౌన్ విధించడం.. వ్యక్తిగత దూరం పాటించేందుకు వీలుగా డివిజన్ల వారీగా ఎక్కడ పడితే అక్కడ కూరగాయలు అమ్ముకోవడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. అక్కడే విక్రయించేలా పర్యవేక్షణ చేశారు. సాధారణ పరిస్థితి వచ్చాక కొన్ని చోట్ల నుంచి దుకాణాలు తొలగించగా.. రహదారులపై మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. వీటిని తొలగించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన షెడ్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నా.. మున్నాళ్ల ముచ్చటగా తయారైంది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా శివారు కాలనీలు విస్తరిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనేందుకు ఒకటెండ్రు ప్రాంతాలకే రాకుండా రద్దీని తగ్గించేందుకు, ఎక్కడి వారిని అక్కడే కొనేందుకు, చిరు వ్యాపారులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు వీలుగా పలు ప్రాంతాల్లో చిన్న మార్కెట్లు నిర్మించారు. ఖాళీ స్థలాలు, రద్దీ సమయాల్లో రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపైనే అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరందరికి ఒక్కో చోట రూ.17 లక్షలకు తగ్గకుండా ఖర్చు చేసి నిర్మించగా అవన్నీ ఖాళీగా ఉన్నాయి.

మార్కెట్లకు రాని వ్యాపారులు.. హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించగా సుమారు 60 మందికి తగ్గకుండా కూర్చోనేందుకు గద్దెలు నిర్మించారు. ఇక్కడికీ పాతబజారు ప్రాంతంలోని వారికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. బస్టాండ్ వెనుకాల వెండింగ్ జోన్‌ను రూ.17 లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. పండ్ల వ్యాపారులకు కేటాయించగా ప్రస్తుతం కమ్మరి వృత్తి చేసే వారికి కేటాయించగా మిగతా భాగం ఖాళీగా ఉంది. కొన్ని రోజులు అంబేడ్కర్ స్టేడియం ఎదురుగా కూర్చోనే వారికి కేటాయించారు. ఇందిరానగర్ మార్కెట్‌ను రూ.30 లక్షలతో నిర్మించగా 60 మంది వ్యాపారులకు సౌకర్యాలు కల్పించారు. అందులో ఉదయం పూట పది మంది వ్యాపారులు మాత్రమే వచ్చి విక్రయిస్తున్నారు. చైతన్యపురి మార్కెట్‌లో సుమారు 45 మంది అమ్ముకునేలా నిర్మించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల వైపు విక్రయించే వారికి కేటాయించగా అందులో సగం మంది వస్తున్నారు. మిగతా వారంతా రోడ్ల మీద అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా సుమారు 60 మంది కూర్చునే విధంగా తీర్చిదిద్దారు. ఇందుల్లోకి టెలిఫోన్ క్వార్టర్స్ వైపు రోడ్ల మీద ఉన్న వారికి కేటాయించాలని నిర్ణయించారు. కశ్మీర్‌గడ్డ రైతుబజారును సమీకృత మార్కెట్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. టెండర్ పూర్తి కాగా రూ.30 లక్షలతో తాత్కాలికంగా షెడ్డు నిర్మించారు. మొత్తం 122 మందికి అవకాశం కల్పించనున్నారు. విద్యానగర్‌లోని ట్యాంకు సమీపంలో వెండింగ్ జోన్ పూర్తయింది. ఇందులో ఆ ప్రాంతంలో రోడ్ల మీదనే ఉండే వారికి అవకాశం ఇస్తారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించిన షెడ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.





# 'బడి గంట రోజే'..జగనన్న విద్యా కానుక

## సీఎం వైయస్ జగన్ చేతుల మీదుగా విద్యా కానుక

అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12వతేదీన స్కూళ్లు పునఃప్రారంభమయ్యే రోజే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కిట్లను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అదే రోజు ఈ కార్యుక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా అధికారులు ఏర్పాుట్లు చేస్తున్నారు. జగనన్న విద్యా కానుకకు సంబంధించి ప్రతి వస్తువును నిర్దిష్ట సమయంలోగా స్కూళ్లకు తరలించేలా తేదీలను నిర్ణయించారు. జూన్ 7వతేదీ నాటికే విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో పాఠశాలలకు చేరుకునేలా చర్యలు చేముట్టింది. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, స్కూళ్లకు తరలింపు ప్రక్రియ పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఇటీవల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జగనన్న విద్యా కానుకలో ప్రతి వస్తువును మండల కేంద్రాల్లో నాణ్యత తనిఖీలు చేసేలా ఒక బృందాున్ని, పర్యవేక్షణ కోసం మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. మండల స్థాయి బృందాలకు సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా స్థాయిలో బృందాలను సిద్ధం చేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌తో పాటు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 26 జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించారు.

**తయారీ దశలోనే తనిఖీలు :** జగనన్న విద్యా కానుకలో ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ఇప్పటికే స్కూళ్లకు తరలింపు పూర్తి కాగా మే 31 నాటికి పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్‌లు, బెల్టులు చేరుకోనున్నాయి. యూనిఫాం, నోట్ బుక్స్, బూట్లు, బ్యాగ్స్, యూనిఫామ్స్ తరలింపును జూన్ 7 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి నిర్దేశించారు. తొలుత జిల్లా కేంద్రాలకు అక్కడ నుంచి 670 మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. అనంతరం అక్కడ నుంచి 45,534 స్కూళ్లకు తరలింపు ప్రక్రియ చేపట్టారు. మొత్తం 39,96,064 జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నారు. ప్రతి వస్తువు అత్యంత నాణ్యతతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుంది. ఈ సారి తయారీ దశలోనే అధికారులు నాణ్యత తనిఖీలను నిర్వహించారు.

# నేడు ఢిల్లీలో పోలవరంపై కీలక భేటీ



అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేయడమే అజెండాగా గురువారం ఢిల్లీలో కేంద్రం కీలక సమావేశం ఏర్పాటుచేసింది. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఆ శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొననున్నారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయం రూ.16,952.07 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పీపీఏకి అందజేసింది. దీనిపై ఈనెల 25న సీడబ్ల్యూసీ, పీపీఏ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను క్షుణ్ణంగా అధ్యయనం చేసి త్వరితగతిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తొలిదశ 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించడం, భూసేకరణ, ప్రధాన డ్యామ్, కుడి, ఎడమ కాలువల్లో మిగిలిన పనుల పూర్తికి అయ్యే వ్యయంపై సమీక్షించిన సీడబ్ల్యూసీ, పీపీఏ అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనతో ఏకీభవిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖకు నివేదిక ఇచ్చినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ నివేదిక ఆధారంగా పోలవరం తొలిదశ అంచనా వ్యయాన్ని ఖరారు చేసి కేంద్ర మంత్రిమండలికి పంపేందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ సిద్ధమైంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేస్తే తొలిదశ సవరించిన అంచనా వ్యయం మేరకు పోలవరానికి నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది.




బుక్కరాయసముద్రం: ఫుడ్ పాయిజన్ కావడంతో 26 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

ఈ ఘటన అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి విద్యార్థులు గుడ్డుతో పాటు టమాటా రైస్, పెరుగన్నం తిన్నారు. ఆ తర్వాత 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారిని అనంతపురంలోని అమరావతి ఆస్పత్రికి తరలించారు.

అందులో ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు మరికొందరు విద్యార్థులు కూడా స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. వారిని హాస్టల్ వద్దే ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

# త్వరలో గ్రూప్ -1, గ్రూప్-2 నోటిఫికేషన్లు: గౌతమ్ సవాంగ్




విజయవాడ: త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్‌లో విడుదలైన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించిన మెయిన్స్ పరీక్షలను జూన్ 3 నుంచి 10 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సవాంగ్ తెలిపారు.

ఈ ఏడాది జనవరి 8న ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించామని సవాంగ్ చెప్పారు. పరీక్షలు జరిగిన 19 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించామని.. 6,455 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. జూన్ 3 నుంచి మెయిన్స్ పరీక్షలను 10 జిల్లాల్లోని 11 కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. కేవలం 15 నిమిషాలు మాత్రమే గ్రేస్ పిరియడ్ ఉంటుందని.. ఆ సమయం దాటితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. జులైలో మెయిన్స్ ఫలితాలు వెల్లడించి ఆగస్టు చివరి నాటికి గ్రూప్-1 ఇంటర్వ్యూలు పూర్తిచేస్తామని గౌతమ్ సవాంగ్ తెలిపారు.




# విఫలమైన నిఘా ఉపగ్రహ ప్రయోగం..!

ఉత్తర కొరియా తొలిసారి చేపట్టిన నిఘా ఉపగ్రహ ప్రయోగం తీవ్ర భయాందోళనలకు కారణమైంది. ఈ ప్రయోగం విఫలం కావడంతో ఆ రాకెట్, ఉపగ్రహ శకలాలు ఎక్కడొచ్చి మీద పడతాయోనని దక్షిణ కొరియా వణికిపోయింది. ఉత్తరకొరియా అధికారిక న్యూస్ఏజెన్సీ ఈ ప్రయోగం విఫలమైన విషయాన్ని నేడు వెల్లడించింది. ఉపగ్రహాన్ని తీసుకెళుతున్న రాకెట్ తొలి, రెండో దశల సమయంలో థ్రస్టను కోల్పోయినట్లు పేర్కొంది. తమ శాస్త్రజ్ఞులు ఈ వైఫల్యానికి గల కారణాలను అధ్యయనం చేస్తున్నారని తెలిపింది. ఈ శకలాలు కొరియా ద్వీపకల్పంలోని ఉత్తరం వైపు సముద్ర జలాల్లో పడినట్లు వెల్లడించింది. కిమ్ సైనిక విస్తరణ చర్యలకు ఇది పెద్ద ఎదురుదెబ్బ. బుధవారం ఉదయం 6.29 సమయంలో ఉ.కొరియాలోని ఈశాన్య ప్రాంతంలోని తాంగ్‌ఛాంగ్-రీ లోని ప్రధాన అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టిందని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రాకెట్ కూలిపోయే సమయంలో అసాధారణ గమనంలో ప్రయాణించిందని వెల్లడించారు. దీనిపై అమెరికాతో సమన్వయం పెంపొందించుకొన్నట్లు తెలిపారు. కొన్ని రాకెట్ శకలాలను కూడా దక్షిణ కొరియా స్వాధీనం చేసుకొంది. మరోవైపు జపాన్ స్పందిస్తూ.. ఏ వస్తువు కూడా అంతరిక్ష కక్ష్యలోకి చేరుకోలేదని వెల్లడించింది.

**ద.కొరియా, జపాన్‌లో అత్యవసర చర్యలు..** ఉత్తరకొరియా రాకెట్ ప్రయోగించిన విషయం తెలియగానే దక్షిణ కొరియా, జపాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. సియోల్ ప్రజలకు స్పీకర్లలో, ఫోన్ సందేశాల ద్వారా హెచ్చరించింది. మరోవైపు జపాన్ ఒకినావాలో క్షిపణి హెచ్చరిక వ్యవస్థను సిద్ధం చేసింది. ఈ ప్రాంతం ఉత్తరకొరియా రాకెట్ గమనమార్గంలో ఉండటంతో ఈ చర్యలు తీసుకొంది. ప్రజలను భవనాలు, అండర్‌గ్రౌండ్‌ల్లోకి వెళ్లమని హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తరకొరియా ప్రయోగాన్ని అమెరికా తీవ్రంగా ఖండించింది. ఇది ఐరాస ఆంక్షలకు వ్యతిరేకంగా బాలిస్టిక్ క్షిపణి టెక్నాలజీని ఉపయోగించడమే అని పేర్కొంది. దీనిపై జాతీయ భద్రతా సలహా మండలి ప్రతినిధి ఆడమ్ హొడ్స్ మాట్లాడుతూ అధ్యక్షుడు జో బైడెన్, నేషనల్ సెక్యూరిటీ టీమ్ అమెరికా మిత్రదేశాలు, భాగస్వాములతో సమన్వయం చేసుకొంటున్నారని వెల్లడించారు.




శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. భాజపా ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ సర్కారు భారత ప్రజలను భయపెడుతోందని, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. ఇక, ప్రధాని మోదీ.. దేవుడికే పాఠాలు చెప్పే ఘనుడంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కాలిఫోర్నియాలోని శాంటా క్లారాలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలతో రాహుల్ చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీపై విమర్శల వర్షం కురిపించారు. "అంతా తమకే తెలుసు అని ప్రజలను నమ్మించే వ్యక్తులు భారత్‌లో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. వారు శాస్త్రవేత్తలకే శాస్త్రాన్ని చెబుతారు. చరిత్రకారులకు చరిత్రను వివరిస్తారు. సైన్యానికి యుద్ధాన్ని నేర్పిస్తారు. వారు దేవుడితో కూర్చుంటే ఆయనకే వివరించగల సమర్థులు. ప్రధాని నరేంద్ర మోదీ అందుకు గొప్ప ఉదాహరణ. ఒకవేళ.. మోదీ ఆ భగవంతుడి పక్కన కూర్చుంటే.. ఈ ప్రపంచం ఎలా పనిచేస్తుందని దేవుడికే చెప్పగలరు. అప్పుడు భగవంతుడు కూడా తాను సృష్టించిన విశ్వం ఇదేనా అని గందరగోళానికి గురవుతారు" అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు.

**అందుకే జోడో యాత్ర..** "భాజపా ప్రజలను భయపెడుతోంది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది. ప్రజలతో మమేకమయ్యేందుకు అవసరమైన అన్ని సాధనాలను భాజపా-ఆర్ఎస్ఎస్ నియంత్రించింది. ఒకప్పటి రాజకీయ వ్యూహాలు ఇక పనిచేయవని అర్థమైంది. అందుకే భారత్ జోడో యాత్రను చేపట్టా. నా యాత్రను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నించింది. కానీ అవి ఫలించలేదు. మా యాత్రకు మరింత ఆదరణ దక్కింది. ఆ ప్రయాణంలో నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా" అని రాహుల్ వివరించారు. వారం రోజుల పర్యటన నిమిత్తం రాహుల్ గాంధీ మంగళవారం అమెరికా చేరుకున్నారు. 'మొహబత్ కి దుకాణ్ (ప్రేమ దుకాణాలు)' పేరుతో కాలిఫోర్నియాలో ఆయన ఈ కార్యక్రమం నిర్వహించారు. వాషింగ్టన్, న్యూయార్క్‌లోనూ రాహుల్ పర్యటించనున్నారు. అక్కడి ప్రవాసభారతీయులతో ఆయన ముచ్చటించనున్నారు. అమెరికా చట్టసభ ప్రతినిధులు, ఇతర రంగాల ప్రముఖులతో ఆయన చర్చలు జరపనున్నారు. జూన్ 4న న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నట్లు కాంగ్రెస్ వెల్లడించింది.




# అధిష్ఠానం మంత్రం ఎంతవరకు ఫలిస్తుందో!

ఢిల్లీ: ఉత్తరాదిలో కీలకమైన రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ మధ్య నెలకొన్న స్పర్థలను తొలగించి జోడు గుర్రాలతో శాసనసభ ఎన్నికలకు వెళ్లాలన్న అధిష్ఠానం ప్రయత్నాలు ఫలించేనా అనే సందేహాలు అప్పుడే మొదలయ్యాయి. అధిష్ఠానం ఈ ఇద్దరు నేతల్ని సోమవారం దిల్లీకి పిలిపించి మాట్లాడి, చేతులు కలిపేందుకు వారు సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను లోతుగా చూసినవారు మాత్రం అవి పైపై మాటలే తప్పిస్తే గుండెలోతుల్లోంచి వచ్చినవి కావని భావిస్తున్నారు. అన్ని అంశాలనూ హైకమాండ్‌కే వదిలేశారని పార్టీ నాయకత్వం ప్రకటించగా.. గహ్లోత్‌తో విభేదించడానికి ఉన్న కీలక అంశాలు అపరిష్కృతంగానే మిగిలి ఉన్నాయని పైలట్ సన్నిహితులు చెబుతున్నారు. దిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తొలుత గహ్లోత్‌తో రెండుగంటలు భేటీ అయ్యారు. తర్వాత పైలట్‌తో విడిగా సమావేశమయ్యారు.

ఆ తర్వాత అందరూ బయటకు వచ్చి ఫొటోలకు ఫోజులిచ్చారు. పేరుకు ఒకేఇంట్లో జరిగిన సమావేశమే అయినా ఇద్దరితో అధిష్ఠానం దాదాపు విడివిడిగానే మాట్లాడిందని చెప్పాలి. విలేకరులు ప్రశ్నించినప్పుడు వారిద్దరూ కాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మాట్లాడారు. సామరస్యత కుదిరిందన్న సంకేతాలు ఇద్దరు కీలక నేతల హావభావాల్లో ఏమాత్రం కనిపించలేదు.

**మూడు డిమాండ్లపై పైలట్ పట్టు :** వసుంధర రాజె ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతిపై చర్యలు, రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పునర్వ్యవస్థీకరణ, పేపర్‌లీక్‌ల వల్ల పరీక్షలు రద్దయి ఇబ్బందులు పడినవారికి పరిహారం చెల్లించడం.. ఈ మూడు డిమాండ్లపై ఏమాత్రం వెనక్కి తగ్గరాదని పైలట్ కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తాను వాటిపై గళమెత్తుతూనే ఉంటానని ఆయన తెగేసి చెబుతున్నారు.

అటు గహ్లోత్ చూస్తే.. ఎవరి డిమాండ్లకూ పార్టీ తలొగ్గబోదనీ, అలాంటి పరిస్థితే కాంగ్రెస్‌లో రాదని కరాఖండీగా ప్రకటిస్తున్నారు. 2018లో రాజస్థాన్‌లో ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఈ ఇద్దరి మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఆ తిరుగుబాటు చర్యలతోనే పైలట్‌ను ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి, పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పించారు. నాయకత్వాన్ని మార్చాలని గత ఏడాది కూడా అధిష్ఠానం ప్రయత్నించింది. శాసనసభాపక్ష సమావేశ నిర్వహణకే గహ్లోత్ విధేయులు అనుమతించకపోవడంతో అది వీలుపడలేదు.

# ఈ నాలుగేళ్లలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేశాం : సీఎం జగన్ ట్వీట్



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ నాలుగేళ్ల పాలనపై ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. 'దేవుని దయతో, మీ అందరి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తైందని, నాపై ఎంతో నమ్మకంతో మీరు ఈ బాధ్యతను అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ ఈ నాలుగేళ్ల కాలంలో 98 శాతానికి పైగా ఎన్నికల హామీలను మన ప్రభుత్వంలో అమలు చేశాం. అలాగే వివిధ రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. మీకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. మన ప్రభుత్వంపై మీ అందరి ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను" అని సీఎం వైయస్ జగన్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

## ఈ రేంజ్ లో లుక్కిస్తే ఎలా సామ్?

స్టార్ హీరోయిన్ సమంత అందానికి అభినయానికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ఏమాయ చేశావే సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టి.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన ఈ ముద్దుగుమ్మ తన అందం అభినయంతో తెలుగు సినీ ప్రేక్షకుల గుండెల్లో గూడు కట్టుకుంది. ఆ తర్వాత కూడా స్టార్ హీరోల సరసన నటిస్తూ.. బాగానే పేరు సంపాధించుకుంది. కేవలం సినిమాల ద్వారానే కాకుండా సోషల్ మీడియా ద్వారా కూడా అభిమానులకు టచ్ లో ఉంటుంది. తన పర్సనల్ లైప్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన అన్ని అప్ డేట్లను షేర్ చేసుకుంటూ ఉంటుంది. మధ్యలో తన ఆరోగ్యం బాగాలేక చాలా రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉన్న ఈ ముద్దుగుమ్మ గత రెండు మూడు నెలలుగా మళ్లీ యాక్టివ్ అయింది. ఎప్పటికప్పుడు తన ఫొటోలను షేర్ చేస్తూ...



అందరినీ ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా సామ్ కు సంబంధించిన కొన్ని ఫొటో నెట్టింట వైరల్ గా మారాయి. షాట్ హెయిర్ తో క్యూట్ గా చూస్తున్న సామ్ ఈ ఫొటోలో అదిరిపోయింది. మరోవైపు తాను వేసుకున్న డ్రెస్స్ ట్రిప్ జారిపోతుండగా.. అభిమానుల వైపు అదోలా చూస్తూ ఆహా అనిపిస్తోంది. చేతిలో రెండు రకాల చిన్న చిన్న పూలు ఉన్న చెట్లను పట్టుకున్న ఈ ముద్దుగుమ్మ... సింగిల్ పీస్ తో రెచ్చిపోయింది. స్కిన్ కేర్ మాయిశ్చరైజర్ కు సంబంధించిన ఓ కంపెనీ.. వాటిని తయారు చేసే పూలు చెట్లను పట్టుకొని సామ్ ఫొటోలు దిగింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు సామ్ లుక్ కు చొంగ కార్చుకుంటున్నారు. ఇంత స్టైలిష్ గా ఉన్న నిన్ను చూస్తే తట్టుకోలేక పోతున్నామంటూ కామెంట్లు చేస్తున్నారు. సామ్ నీ అందం రోజు రోజుకూ పెరిగిపోతోందంటూ చెబుతున్నారు. ఇటీవలే సమంత క్రియేటివ్ డైరెక్టర్ గుణశేఖర్ దర్శకత్వంలో శాకుంతలం సినిమాలో నటించింది. కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలం నవల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. డీఆర్పీ గుణా టీమ్ వర్క్స్ పతాకంపై గుణశేఖర్ కుమార్తె నీలిమ గుణ భారీ బడ్జెట్ తో చిత్రాన్ని నిర్మించారు. తెలుగుతో పాటు హిందీ తమిళ మలయాళ కన్నడ భాషల్లో ఏప్రిల్ 14వ తేదీన ఈ చిత్రం రిలీజ్ కాబోతుంది.

## హీరోల వయసుతో సంబంధం లేదంటున్న శృతి హాసన్..!

కమల్ గారాల పట్టి శృతి హాసన్ ప్రస్తుతం తెలుగులో మళ్లీ ఫామ్ లోకి వచ్చింది. కెరీర్ మొదట్లో వరుస ఫ్లాపులతో ఐరన్ లెగ్ ముద్ర వేసుకున్న అమ్మడు పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ తో సూపర్ హిట్ అందుకుంది. ఇక అక్కడ నుంచి వరుస స్టార్ సినిమాలు చేస్తూ సూపర్ పాపులర్ అయ్యింది శృతి హాసన్. తనకు హీరోయిన్ గా స్టార్ ఇమేజ్ వచ్చింది తెలుగు సినిమాల వల్లే అంటూ రీసెంట్ ఓ స్పెషల్ చిట్ చాట్ లో చెప్పుకొచ్చింది శృతి హాసన్. అందుకే తెలుగు పరిశ్రమ మీద విశ్వాసంగా ఉంటానని అంటుంది శృతి హాసన్. అంతేకాదు కథ నచ్చితే హీరోల వయసు గురించి పట్టించుకోను.. చిరంజీవి గారితో చేసిన వాల్తేరు వీరయ్య బాలకృష్ణ గారితో చేసిన వీర సింహా రెడ్డి ఈ రెండు సినిమాలు కథ నచ్చబట్టే చేశానని అలాగే



ఆ రెండు సినిమాలు పెద్ద హిట్ అయ్యానని అన్నారు శృతి హాసన్. ప్రస్తుతం ది ఐ అనే హాలీవుడ్ సినిమాతో పాటుగా ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రశాంత్ నీల్ టేకింగ్ ఒక లెవల్ లో ఉంటుంది. అయితే ఆ సినిమా గురించి తాను ఇప్పుడు ఎక్కువగా చెప్పలేనని అన్నారు శృతి హాసన్. తొలి సినిమా హిందీలో చేశా.. నాన్న కమల్ హాసన్ బ్యానర్ లో రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లో హీరోయిన్ గా ఛాన్స్ ఇస్తే చేస్తానని అన్నారు. సినిమాల్లో ప్రత్యేకంగా జీవిత లక్ష్యమేమి లేదని.. సొంత కాళ్లపై ధైర్యంగా నిలబడటమే ముఖ్యమని అన్నారు. జీవితంలో పెళ్లి ఒక భాగం మాత్రమే అదే జీవితం కాదని అన్నారు శృతి హాసన్. డిప్రెషన్ తో బాధపడుతున్న వారికి కౌన్సిలింగ్ అనేది బాగా అవసరం.. అలాంటి బాధితులు కూడా తమ బాధలను బహిరంగంగా వ్యక్తపరచాలి.. వారి కోసం ఒక సంస్థను ఏర్పాటు చేస్తున్నానని అన్నారు శృతి హాసన్.




# సీనియర్ భామలు మెలితిప్పేస్తున్నారే!



రంగుల ప్రపంచంలో హీరోయిన్ల మధ్య పోటీ ఎలా? ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. వెండి తెర పై ఒకరికొకరు పోటీ పడి నటించడానికి ఏమాత్రం వెనకడుగు వేయరు. అద్భుతమైన నటనే కాదు. అవసరమైతే అదే రేంజ్ లో అందాలు ఆరబోస్తున్నారు. స్కిన్ షో..గ్లామర్ షో..క్లీవేజ్ షో అంటూ రచ్చ మామూలుగా ఉండదు. అవసరం మేర ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించడానికి ఏమాత్రం వెనుకడుగు వేయరు. సహజంగా ఈ పోటీ వాతావరణం ఎక్కువగా నవతరం నాయికల్లో కనిపిస్తుంది. కానీ ఈ విషయంలో సీనియర్ భామలు కూడా తక్కువేం కాదని నిరూపిస్తున్నారు. తమన్నా..కాజల్ అగర్వాల్..సమంత..శ్రుతి హాసన్ లు సైతం ఒకరికొకరు స్కిన్ షో విషయంలో పోటీ పడుతున్నారు. ఈ మధ్యనే రిలీజ్ అయిన 'వీరసింహారెడ్డి'లో శ్రుతిహాసన్ ఎలా చెలరేగిందో? తెలిసిందే. సీనియర్ స్టార్ బాలయ్య సరసన గ్లామర్ డాల్ గా ఆకర్షించింది. ఇన్ స్టా గ్లామర్ క్వీన్ లా వెండి తెర పై చెలరేగింది. స్కిన్ షో ఎలివేషన్ లో తనదైన మార్క్ వేసింది. బాలయ్యకి? కుమార్తె వయసున్న శ్రుతిహాసన్ ఏంటి? అని విమర్శించిన వారికి నోటి మీద వేలేసుకునేలా సమాధానం ఇచ్చింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోనూ తనదైన మార్క్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంది. అలాగే చందమామ కాజల్ అగర్వాల్ మమ్మీ అయినా అందం ఏమాత్రం తరిగిపోలేదు. కాస్త బొద్దు గా తయరైనా బ్యూటీ విషయంలో ఎక్కడా చెక్కు చెదరలేదు. 'ఇండియన్ –2'లో అందాల విందు చేయనుందని అభిమానులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. శంకర్ సినిమా అంటే? పాత్రకి అనుగుణంగా ఎవరైనా సిద్ధం కావాల్సిందే కాబట్టి చందమామ అందాలపై ఆశలు భారీగానే ఉన్నాయి. ఇక మిల్కీబ్యూటీ తమన్నా ఇంకా కుర్ర భామలాగే చెలరేగుతుంది. పాల అందాలతో అదే ఛరిష్మాతో కొనసాగుతుంది. చిన్న సినిమాల్లో సైతం తనదైన శైలి అందాల ఆరబోత తప్పనిసరి అంటోంది. మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తోన్న 'భోళాశంకర్' లో తమన్నా అందాలు విచ్చలవిడిగానే ఉంటాయని అంచనాలున్నాయి. మెహర్ రమేష్ సినిమాల్లో హీరోయిన్లను గ్లామరస్ బ్యూటీలుగా ఆవిష్కరిం చడం ఆయన స్టైల్. అయితే అన్నయ్యతో సినిమా కాబట్టి ఆ విషయంలో కాస్త బ్యాలెన్స్ గా ఉండే ఛాన్స్ ఉంది. ఇక వీళ్లందరికంటే సమంత గ్లామర్ ఎలివేషన్ లో చాలా అడ్వాన్స్ గా ఉంది. 'ఊ అంటావా' పాటతో దేశాన్ని తన అందాలతో కట్టిపడేసింది. ఇండియన్ వెర్షన్ 'సీటాడెల్' సిరీస్ లోనూ సమంత కొన్ని ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ నటిస్తుందని ప్రచారం సాగుతోంది. ఆ రకంగా ఈ నలుగురు భామలు నవ నాయికల్లే మించిపోతున్నారు.

# మళ్లీ సీతగా... మృణాల్ ఇంట్రెస్టింగ్ ఆన్సర్




బుల్లి తెర నుండి బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చి హీరోయిన్ గా వరుసగా సినిమాలు చేస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఈ అమ్మడు తెలుగు నటించిన మొదటి చిత్రం సీతారామం భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రంలో మృణాల్ పోషించిన సీత పాత్ర ను తెలుగు ప్రేక్షకులు మర్చిపోలేక పోతున్నారు. అందుకే మృణాల్ ఠాకూర్ ను సోషల్ మీడియా ద్వారా మళ్లీ మళ్లీ సీతారామం పాత్ర గురించి.. సినిమా సీక్వెల్ గురించి అడుగుతూనే ఉంటారు. తాజాగా ఈ అమ్మడు నటించిన ఒక హిందీ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా సోషల్ మీడియాలో అభిమానులతో చిట్ చాట్ చేసింది. ఆ సందర్భంగా మృణాల్ ను ఒక ఫ్యాన్ సీతారామం 2 సాధ్యం అయ్యేనా అంటూ ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు మృణాల్ స్పందిస్తూ.. నాకు దాని గురించి ఐడియా లేదు... కానీ సీక్వెల్ చేయాలని.. చేస్తే నటించాలని మాత్రం ఉంది అంటూ క్లారిటీ ఇచ్చింది. ఇప్పుడు దర్శకుడు ఎలా స్పందిస్తాడు.. ఆయన ఉద్దేశ్యం ఏంటి అనేది చూడాలి. గతంలో సీతారామం సినిమా సీక్వెల్ గురించి దుల్కర్ సల్మాన్ ను ప్రశ్నించిన సందర్భంగా ఒక వేళ సీక్వెల్ ఉన్నా కూడా నేను ఎలా ఉండగలను.. పార్ట్ 1 లో నేను చనిపోయాను కదా అన్నట్లుగా ఆయన సరదాగా కామెంట్ చేశాడు. హను రాఘవపూడి కూడా సీతారామం సినిమా యొక్క సీక్వెల్ పై ఆసక్తిగా లేను అన్నట్లుగా క్లారిటీ ఇచ్చాడు. సూపర్ హిట్ చిత్రాలన్నింటికి కూడా సీక్వెల్ అంటే సాధ్యం కాదు. కానీ సీత పాత్రను తీసుకుని మరో విభిన్నమైన కథతో సినిమాను తీస్తే బాగుంటుందని మాత్రం కొందరు ఆ మధ్య దర్శకుడు హను రాఘవపూడి కి సూచించారు. ఆయన ప్రయతిస్తాడా లేదా అనేది చూడాలి. ఇక మృణాల్ సినిమాల విషయానికి వస్తే తెలుగు లో సీతారామం తర్వాత చాలానే ఆఫర్లు వచ్చాయి. కానీ కథ మరియు పాత్ర విషయంలో కాస్త ఎక్కువ ఆలోచించడం వల్ల ఇప్పటి వరకు నాని సినిమాకు మాత్రమే కమిట్ అయింది. ప్రస్తుతం ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలో ఆ సినిమాల్లో ఒకటి అయినా కన్ఫర్మ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఆ చూపులతో మత్తెక్కిస్తోంది

సోషల్ మీడియా ద్వారా జూనియర్ సమంత అంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకుని ఆ తర్వాత బుల్లి తెర పై ఎంట్రీ ఇచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపును మరియు ఇమేజ్ ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ అషు రెడ్డి. బుల్లి తెర పై ఈ అమ్మడి జోరు బిగ్ బాస్ తో పీక్స్ కు చేరింది. పవన్ ను అభిమానిస్తాను అంటూ చెప్పడంతో పాటు ప్రైవేట్ పార్ట్ లో పవన్ పేరును టాటూ



వేయించుకోవడం తో చాలా మంది దృష్టిలో పడింది. అషురెడ్డి యొక్క అందాల ఆరబోత గురించి ఎంత చెప్పినా తక్కువే అనడంలో సందేహం లేదు. హీరోయిన్స్ రేంజ్ లో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఉంటుంది. అందాల విందు తో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఫాలోవర్స్ ను సొంతం చేసుకున్న ఈ అమ్మడు హీరోయిన్స్ కు ఏ మాత్రం తక్కువ కాదు అంటూ ప్రతి ఫొటో షూట్ తో నిరూపించుకుంటూ ఉంది. రెండు మిలియన్ ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడి యొక్క అందాల విందు జాతర ఫొటో షూట్స్ మతి పోగొడుతూ ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫొటో షూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

ఈసారి తన చూపుతో నెటిజన్స్ కు అభిమానులకు మత్తు మందు జల్లిందా అన్నట్లుగా చూస్తూ మతి పోగొడుతోంది.

ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం.. ఆ ఫిజిక్ ను అషు రెడ్డి ఎప్పుడు కూడా చాలా అందంగా అలంకరించుకుని చూపిస్తుంది అనడంలో సందేహం లేదు. అందంగా ఉండటం ఒక ఎత్తు అయితే.. ఆ అందాన్ని మరింత అందంగా చూపించడం మరో ఎత్తు. తన అందాన్ని రెట్టింపు అందంగా కనిపించేలా ఈ అమ్మడు ఎప్పుడు కూడా సందడి చేస్తుంది అనడంలో సందేహం లేదు.

## ఎద అందాలతో మెరిసిపోతున్న రాశిఖన్నా

టాలీవుడ్ హాట్ బ్యూటీ రాశిఖన్నా ఈ మధ్య గ్లామర్ డోస్ కాస్తా పెంచింది అని చెప్పాలి. టాలీవుడ్ లో సూపర్ సక్సెస్ అందుకున్న ఈ అమ్మడు ఫోకస్ అంతా ఇప్పుడు బాలీవుడ్ మీద ఉంది. హిందీలో రెండు సినిమాలు ఈమె చేతిలో ఉన్నాయి. ఇక ఇప్పటికే డిజిటల్ ఎంట్రీ కూడా ఇచ్చిన రాశిఖన్నా డిఫరెంట్ క్యారెక్టర్స్ తో దూసుకుపోతుంది. హీరోయిన్ గానే కాకుండా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలకి కూడా ఒకే చెబుతుంది. రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్ నుంచి బయటకి రావాలని ప్రయత్నం చేస్తున్న ఈ బ్యూటీ ఆ దిశగానే తన సినిమాల ఎంపిక కూడా చేసుకుంటూ ఉండటం విశేషం. రాశిఖన్నా చివరిగా తెలుగులో నాగ చైతన్య హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్ లో వచ్చిన థాంక్యూ మూవీలో నటించింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. తమిళంలో కార్తికి జోడీగా సర్దార్ సినిమాలో నటించింది.



ఇక ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ మూవీలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా రాశిఖన్నా నటించి మెప్పించింది. షాహిద్ కపూర్ కి జంటగా రొమాంటిక్ సన్నివేశాలలో కూడా ఈ అమ్మడు రెచ్చిపోవడం విశేషం. ఇదిలా ఉంటే హిందీలో యోద సినిమాలో ప్రస్తుతం నటిస్తుంది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తుంది. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో రాశిఖన్నా యాక్టివ్ గా ఉంటుంది. హాట్ హాట్ ఫోటోలని రెగ్యులర్ గా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తుంది. తాజాగా ఈ అమ్మడు పింక్ విల్లా ఫ్యాషన్ ఈవెంట్ లో సందడి చేసింది. ఈ ఈవెంట్ లో పింక్ కలర్ మోడరన్ అవుట్ ఫిట్ తో మెరిసిపోయింది. ఈ కాస్ట్యూమ్స్ లో ఎద అందాలని చూపిస్తూ కుర్రాళ్ళని రాశిఖన్నా టెంప్ట్ చేస్తుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్స్టాగ్రామ్ లో వైరల్ గా మారాయి. వీటిని ఏకంగా2.30 లక్షల మంది లైక్ చేయడం విశేషం.





# విప్రహిత బ్రాహ్మణ సదన్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్: పురవాసుల హితం కోరేవారే పురోహితులు అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బ్రాహ్మణుల్లోనూ చాలామంది పేదలున్నారని చెప్పారు. బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ.100కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదన్‌ను సీఎం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "విప్రహిత బ్రాహ్మణ సదనాన్ని రూ.12కోట్లతో నిర్మించాం. బ్రాహ్మణ సదన్‌ను నిర్మించడం దేశంలో ఇదే మొదటిసారి. వేదశాస్త్ర విజ్ఞాన భాండాగారంగా బ్రాహ్మణ సదన్ విలసిల్లాలి. బ్రాహ్మణుల సంక్షేమానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలోని మరో 2,696 దేవాలయాలకు ధూప, దీప, నైవేద్యాల పథకాన్ని వర్తింపజేస్తాం. ఈ పథకం కింద నెలకు ఇచ్చే నిధులను రూ.10వేలకు పెంచాం. వేదపండితులకు ఇచ్చే గౌరవ భృతిని రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంచాం. అర్హత వయసు 75 నుంచి 65 ఏళ్లకు తగ్గించాం" అని కేసీఆర్ తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, ఎంపీ రంజిత్‌రెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, రాజీవ్‌శర్మ, కేవీ రమణాచారితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు, పండితులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సదన్ నిర్మాణానికి ప్రభుత్వం గోపన్‌పల్లి గ్రామంలో 6 ఎకరాల 10 గుంటల స్థలాన్ని కేటాయించింది. ఇందులో బ్రాహ్మణ సమాజ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 12 నిర్మాణాలను చేపట్టారు. 2017 జూన్ 5న పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మూడంతస్థుల్లో ఉన్న ఈ భవనంలో కల్యాణ మండపం, సమాచార కేంద్రం, పీఠాధిపతుల, ధర్మాచార్యుల సదనం ఉన్నాయి.




**చెప్పులతో కొట్టుకున్న కార్యకర్తలు! :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా మారింది. ఫ్లెక్సీల్లో కొండా దంపతుల ఫొటోలు లేకపోవడంపై వారి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎర్రబెల్లి స్వర్ణ, కొండా వర్గాల కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. గొడవ ముదరడంతో ఇరు వర్గాలవారు పరస్పరం చెప్పులతో దాడి చేసుకున్నారు.




ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఓటీటీలోనూ పొగాకు వ్యతిరేక హెచ్చరికలు తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ బుధవారం ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే.. సదరు పబ్లిషర్‌పై తీవ్ర చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది.

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై ప్రచారాన్ని నిషేధించిన 2004నాటి చట్టంలో నిబంధనలను సవరిస్తూ కేంద్ర ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం.. ఓటీటీ మాధ్యమాల్లో ప్రదర్శించే వెబ్ సిరీసులు, సినిమాలు, ఇతర వినోద కార్యక్రమాల్లో పొగాకు వినియోగానికి సంబంధించిన దృశ్యాలుంటే ఇకపై హెచ్చరికలు జారీ చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. 'పొగాకు వినియోగం క్యాన్సర్ కారకం, పొగాకు వినియోగం ప్రాణాంతకం' అని సినిమా థియేటర్లు, టీవీల్లో ప్రదర్శించినట్లుగానే ఓటీటీల్లోనూ కార్యక్రమం ప్రారంభానికి ముందు, మధ్యలో కనీసం 30 సెకన్ల పాటు పొగాకు దుష్ప్రభావాన్ని వివరించేలా ప్రకటన ను ప్రదర్శించాలని తెలిపింది. దీంతోపాటు పొగాకు ఉత్పత్తులను, వాటి వినియోగాన్ని చూపే దృశ్యాలు వచ్చినప్పుడు డిస్‌క్లెయిమర్‌ను చూపించాలని పేర్కొంది. ఈ సందేశం కూడా నిబంధనలకు అనుగుణంగా.. తెలుపు బ్యాక్‌గ్రౌండ్‌లో నలుపు రంగులో ఉండాలని పేర్కొంది. అంతేగాక, ఈ హెచ్చరికల ప్రకటనలు ఓటీటీ కంటెంట్ ప్రసారమయ్యే భాషలోనే ఉండాలని స్పష్టం చేసింది. ఓటీటీల్లో ప్రదర్శితమవుతున్న వెబ్ సిరీసులు, సినిమాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని విచ్చలవిడిగా చూపుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

కేంద్ర సమాచార, ప్రసార శాఖతో చర్చలు జరిపిన తర్వాతే ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఆరోగ్యశాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే.. ఆరోగ్యశాఖ, సమాచార ప్రసార శాఖ, ఐటీ శాఖ ప్రతినిధులు దీనిపై చర్యలు తీసుకుంటారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. సదరు పబ్లిషర్‌ను గుర్తించి నోటీసులు జారీ చేస్తామని వెల్లడించారు.

# నీకు దమ్ముంటే అన్ని స్థానాల్లో పోటీ చెయ్ అసద్...



కరీంనగర్: ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింల జీవితాల్ని ఎంఐఎం నాశనం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవాలని ఎంఐఎం చూస్తోందన్నారు. ఎవరు అధికారంలో ఉంటే వాళ్ళ మో చేతి నీళ్లు తాగడం ఎంఐఎంకు అలవాటే అని దుయ్యబట్టారు. "నీకు దమ్ముంటే తెలంగాణలో అన్ని స్థానాల్లో పోటీ చెయ్. ముస్లిం సమాజం ఎంఐఎంను చీదరించుకుంటోంది. నీ తమ్ముని మాటలపై స్పందించు అసద్. నీ ఆస్పత్రిలో పని చేసే వ్యక్తి ఉగ్రవాద సంస్థకు నాయకుడు. నీకు దమ్ముంటే.. మొగాళ్లు అయితే.. పోటీ చెయ్.. మేం సింగిల్‌గా వస్తాం. అమిత్ షా ఇల్లు పేల్చాలని ఎంఐఎం నేతలు చెప్తారేమో" అంటూ వ్యాఖ్యలు చేశారు. పార్టీలో చర్చించి పాదయాత్రపై నిర్ణయం తీసుకుంటామన్నారు. బస్సు యాత్రనా.. పాదయాత్రనా చర్చిస్తామని బండి సంజయ్ వెల్లడించారు. ఈరోజు ఉదయం జిల్లాలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో వెంకన్న ఆలయం కట్టడం తమ అదృష్టమన్నారు. ఆలయాలకు రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆలయాన్ని నిర్మిస్తున్న టీటీడీకి ఎంపీగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బండి సంజయ్ తెలిపారు.

# టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన

కరీంనగర్: కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. మంత్రి గంగుల కమలాకర్, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాగా, ఆలయ శంకుస్థాపన సందర్భంగా టీటీడీ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహావచన, అగ్ని ప్రణయం, కుంభారాధన, విశేష హోమాలు, శంఖువుకు, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. శ్రీవారి ఆలయం కరీంనగర్‌లో కొలువుదీరడం మా అదృష్టం. ఆలయానికి 10 ఎకరాల భూమి మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. మా విజ్ఞప్తిని మన్నించి టీటీడీ ఆలయం, 20కోట్లు మంజూరు చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవడం మాకు దొరికిన అదృష్టం అని తెలిపారు. అనంతరం, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తిరుమలలో మాదిరిగానే కరీంనగర్‌లోనూ



సర్వకైంకర్యాలు జరుగుతాయి. టీటీడీ తరఫున అర్చకులు, సిబ్బంది, ప్రసాదంతో పాలు తదితరాలు ఉంటాయి. కరీంనగర్, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. పోటు ద్వారా ప్రసాదాలను సైతం ఇక్కడే తయారు చేస్తామని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.




దిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు చేస్తోన్న ఆందోళనపై అంతర్జాతీయ రెజ్లింగ్ బాడీ స్పందించింది. కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవం వేళ.. అటుగా మార్చ్ చేపట్టిన రెజ్లర్లను నిర్బంధించడాన్ని ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. అలాగే రెజ్లింగ్ సమాఖ్యకు 45 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే సస్పెన్షన్‌ను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. 'రెజ్లర్లతో వ్యవహరించిన తీరు, వారి నిర్బంధాన్ని ఖండిస్తున్నాం. అలాగే లైంగిక వేధింపుల ఆరోపణలపై చేస్తోన్న దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేకపోవడం తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది. రెజ్లర్లు చేస్తోన్న ఆరోపణలపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని కోరుతున్నాం. అంతేగాకుండా 45 రోజుల్లో ఎన్నికలు నిర్వహించకపోతే.. భారత రెజ్లింగ్ సమాఖ్యను సస్పెండ్ చేయాల్సి ఉంటుంది. గత కొద్దినెలలుగా రెజ్లర్ల చేస్తోన్న ఆందోళనను మేం గమనిస్తున్నాం. ఈ నిరసనల ప్రారంభ రోజుల్లోనే భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిని ఆయన బాధ్యతల నుంచి పక్కన పెట్టిన విషయం మా దృష్టిలో ఉంది. ఆయన ప్రస్తుతం సమాఖ్య ఇంఛార్జ్ కాదు. రెజ్లర్ల భద్రత, నిష్పాక్షిత దర్యాప్తు నిర్ధారించేందుకు మరోసారి సమావేశం నిర్వహించనున్నాం'అని యూడబ్ల్యూడబ్ల్యూ తన ప్రకటనలో స్పష్టం చేసింది. మంగళవారం రెజ్లర్లు తీవ్ర నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. లైంగిక ఆరోపణలు, బ్రిజ్ భూషణ్‌పై చర్యల విషయంలో కేంద్రం స్పందించనందుకు నిరసనగా పతకాలను గంగలో కలిపేందుకు హరిద్వార్ చేరుకున్నారు. హర్ కీ పౌఢీ వద్ద సుమారు 20 నిమిషాలపాటు పాటు మౌన దీక్ష చేశారు. ఆ తర్వాత గంగా నది ఒడ్డుకు చేరుకుని పతకాలను గంగలో కలిపేందుకు సిద్ధమయ్యారు. ప్రాణ సమానమైన పతకాలను నిమజ్జనం చేయాల్సి వస్తోందంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు. తమను ఈ స్థితికి తీసుకొచ్చిన నేతలపై విమర్శలు గుప్పించారు. వారి రోదనలతో అక్కడి వాతావరణం గంభీరంగా మారిపోయింది. అయితే, చివరి క్షణంలో ఖాప్, రైతు సంఘాల నేతలు వారిని వారించారు. కేంద్ర ప్రభుత్వానికి కొంత గడువిద్దామని ప్రతిపాదించారు. దాంతో ప్రభుత్వానికి ఐదు రోజుల గడువిస్తున్నామని, అప్పటిలోగా చర్యలు తీసుకోకుంటే పతకాలు గంగలో కలిపేస్తామని స్పష్టం చేశారు.

**వ్యంగ్యంగా స్పందించిన బ్రిజ్ భూషణ్.. :** 'పతకాలను గంగలో కలిపేస్తామని వారు(రెజ్లర్లు) హరిద్వార్ వెళ్లారు. కానీ, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని వాటిని టికాయత్‌కు అప్పగించారు. అట్లుంది మరి వారి సిద్ధాంతం. మేం ఏం చేయగలం? నాపై వచ్చిన ఆరోపణలను దిల్లీ పోలీసులు విచారిస్తున్నారు. అవి నిజాలైతే.. నేను అరెస్టవుతా' అని బ్రిజ్ భూషణ్ వ్యాఖ్యానించారు.




## బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య అంతర్గత విభేదాలు!

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా ముందుకుసాగుతున్న కమలంలో కల్లోలం మొదలైంది. నివురుగప్పిన నిప్పులా నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి. బండి సంజయ్, ఈటల రాజేందర్ రెండు వర్గాలుగా వీడిపోవడం పార్టీకి తీవ్రనష్టాన్ని కలిగించేలా ఉంది. ఇప్పటికే జాతీయ నాయకత్వం ఇద్దరు నేతలను దిల్లీ పిలిపించి.. విభేదాలు పక్కనపెట్టాలని, పార్టీ విజయానికి పనిచేయాలని దిశానిర్దేశం చేసినా ఫలితం లేకపోయింది. ఈటల వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న అధిష్ఠానం.. నేతలెవ్వరూ పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించింది.


# బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తున్నాం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ : బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ. 100 కోట్లు కేటాయించి, ఆ నిధులతో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గోపన్‌పల్లిలో 9 ఎకరాల స్థలంలో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో బ్రాహ్మణుల సంక్షేమాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. బ్రాహ్మణుల మనసు, మాట, శరీరం చేసే పని లోకహితం కోసమే అని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానం సర్వజన సమాదరణ, పేదరికం ఎవరి జీవితాల్లో ఉన్నా వారిని ఆదుకోవాలనే మానవీయ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుంది. కులానికి పెద్దలైనా బ్రాహ్మణుల్లోనూ చాలా మంది పేదలు ఉన్నారు. వారిని ఆదుకోవడం ప్రభుత్వం తన బాధ్యతగా భావించింది. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను తెలంగాణ ప్రభుత్వం 2017, ఫిబ్రవరి 1న ఏర్పాటు చేసింది. బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తున్నాం. ఈ నిధులతో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

**బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్..** విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు వివేకానంద ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందిస్తున్నాం. 780 మంది ఈ స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. పేద బ్రాహ్మణుల జీవనోపాధి నిమిత్తం బ్రాహ్మిణ్ ఎంపవర్‌మెంట్ స్కీం ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే పథకం అమలు చేస్తున్నాం. ఈ పథకం కింద గ్రాంట్‌గా రూ. 5 లక్షల గ్రాంట్‌ను ప్రభుత్వం అందిస్తున్నది. ఇందుకోసం ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 150 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని కేసీఆర్ తెలిపారు.

# 'పుష్ప 2' మూవీ ఆర్టిస్టులతో వెళ్తున్న బస్సుకు ప్రమాదం

నల్గొండ : 'పుష్ప 2' మూవీ ఆర్టిస్టులతో వెళ్తున్న బస్సుకు ప్రమాదం చోటు చేసుకుంది. నార్కట్ పల్లి వద్ద ఆర్టీసీ బస్సును వెనక నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ట్రావెల్స్ బస్సులో ప్రయాణం చేస్తున్న పలువురు పుష్ప 2 మూవీ ఆర్టిస్టులకు గాయాలయ్యాయి. షూటింగ్ ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంతో హైద్రాబాద్ - విజయవాడ 65వ జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ జాం అయింది. చింతూరు మండలం మోతుగూడెంలో పుష్ప-2 షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షూటింగ్ చూడటానికి నాలుగు రాష్ట్రాల నుంచి ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలం గాణ రాష్ట్రాల ప్రజలు వస్తున్నారు. కొందరు అధికారులు డైరెక్టర్ సుకుమార్, పుష్ప-2 విలన్ ఫాహద్ పాజిల్‌తో సెల్ఫీలు దిగారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న పుష్ప-2 సినిమా చిత్రీకరణ మోతుగూడెం సరిహద్దు ఒడిశా రాష్ట్రంలోని ఎర్రబోరు అటవీ ప్రాంతంలో జరుగుతోంది. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో ఆంధ్ర,




ఒడిశా సరిహద్దు గ్రామాల యువతకు అవకాశం కల్పించారు. ఇప్పటికే 600 మంది యువకులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నియంత్రించే సివిల్ సీఆర్పీఎఫ్ పోలీసులుగా, అటవీ శాఖ ఉద్యోగులుగా, ఎర్రచందనం దొంగలుగా షూటింగ్‌లో పాల్గొంటున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com